పరిష్కారమే.. తరువాయి

భూ భారతి పైలట్ మండలం మద్దూరులో 1341 ఫిర్యాదుల స్వీకరణ



భూ భారతి ఫిర్యాదులపై సమీక్ష చేస్తున్న నారాయణ పేట కలెక్టర్ సిక్తా పట్నాయక్(ఫైల్)

- పూర్తయిన దరఖాస్తుల పరిశీలన
- కక్షిదారులందరికీ నోటీసులు జారీ.. 10 రోజుల్లోగా వివరణ కోరిన అధికారులు
- ఈ నెల 20 వరకు పరిష్కరించేందుకు మండలంలో 7 బృందాల ఏర్పాటు
- ఒక్కో బృందంలో ఒక డిప్యూటీ తహసీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, సర్వేయర్

మహబూబ్‌నగర్, మే 12(ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : గత ప్రభుత్వంలో అనేక విమర్శలు ఎదుర్కొన్న ధరణి పోర్టల్‌ను రద్దు చేసి, భూ భారతి పోర్టల్‌ను రైతులకు ఉపయోగకరంగా తెస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. అందులో భాగంగా భూ భారతి చట్టం చేసి, ధరణి పేరును కూడా మార్చింది. అయితే ఇంకా పాత పోర్టల్ మాడ్యూల్స్ ప్రకారమే రిజిస్ట్రేషన్ ప్రక్రియ సాగుతోంది. కొత్త పోర్టల్ ప్రారంభించలేదు. గత ప్రభుత్వం ధరణిని ప్రారంభించిన సమయంలో క్షేత్రస్థాయిలో ఎలాంటి సమస్యలు ఉత్పన్నం అవుతాయో తెలుసుకో లేదు. చట్టంపై అవగాహన కల్పించకుండా సమస్య ఉత్పన్నమైనప్పుడల్లా ఒక కొత్త మాడ్యూల్‌ను తేవడంతో అనేక విమర్శలను ఎదుర్కొంది. అలాగే స్థానికంగా ఉండే ఆర్డీవో, జేసీ కోర్టులను రద్దు చేయడంతో రైతులు చాలా ఇబ్బంది పడ్డారు. దీంతో ప్రస్తుత ప్రభుత్వం క్షేత్రస్థాయిలో సమస్యలను తెలుసుకోవడం, వాటికి పరిష్కార మార్గాలను పోర్టల్‌లలో పెట్టేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఐదు మండలాలను పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన విషయం తెలిసిందే. గత నెలలో 17వ తేదీన నారాయణపేట జిల్లా మద్దూరు మండలం ఖాజీపూర్‌లో భూ భారతి సదస్సును రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. ఆ రోజు నుంచి 30వ తేదీ వరకు మండల పరిధిలోని 17 రెవెన్యూ గ్రామాల్లో రైతుల నుంచి సమస్యలపై అధికారులు దరకాస్తులను స్వీకరించారు. ఇప్పుడు ఆ ఫిర్యాదులు పరిష్కరించే పనిలో నిమగ్నమయ్యారు. వచ్చే నెలలో రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా భూ భారతి పోర్టల్‌ను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించే అవకాశం ఉంది. ఆ లోపే పైలట్ మండలాల్లో వచ్చిన సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించే అవకాశం ఉంది.



1,341 ఫిర్యాదులు

పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన మద్దూరు మండలంలో 14 రోజుల పాటు 17 రెవెన్యూ గ్రామాల్లో రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరించగా, 1,341 దరఖాస్తులు వచ్చాయి. అందులో 902 సర్వే నెంబర్లకు సంబంధించిన సమస్యలు ఉన్నాయి. అత్యధికంగా సర్వే నెంబర్ల తప్పులకు సంబంధించి 491 ఫిర్యాదులు రాగా, కొత్త పాసు పుస్తకాలకు సంబంధించి 11, విస్తీర్ణంలో హెచ్చు తగ్గులకు సంబంధించి 231, నేచర్ ఆఫ్ ల్యాండ్, టైప్ ఆఫ్ ల్యాండ్‌కు సంబంధించి 20, పట్టాదారు సమస్యకు సంబంధించి 21, నిషేధిత జాబితాలో చేర్చిన భూములకు సంబంధించి 28, సాదా బైనామాలకు సంబంధించి 113, అసైన్డ్ భూముల సమస్యలపై 96, సర్వే నెంబర్ సబ్ డివిజన్ సమస్యలపై 50, ఇతర ఫిర్యాదులు

(మిగతా 6లో..)

నేటి నుంచి ఉపాధ్యాయులకు శిక్షణ

- ఆయా జిల్లాల్లో విడతల వారీగా..
- స్కూల్ అసిస్టెంట్‌లకు జిల్లా కేంద్రాల్లో..
- ఎస్‌జీటీలకు మండల కేంద్రాల్లో ట్రైనింగ్
- ఉమ్మడి జిల్లాలో 3,227 ప్రభుత్వ స్కూల్స్
- 12,854 మంది ఉపాధ్యాయులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం/ నారాయణపేట, మే 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలన్న లక్ష్యంతో పాఠశాల విద్యాశాఖ ఆదేశాల మేరకు ఉపాధ్యాయులకు వేసవి సెలవుల్లో విడతల వారీగా శిక్షణ ఇచ్చేందుకు జిల్లా విద్యాశాఖ, అకడమిక్ మానిటరింగ్ అధికారులు ఏర్పాట్లు చేశారు. మంగళవారం నుంచి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొదటి విడత శిక్షణ ప్రారంభం కానుంది. ఈ శిక్షణ ఉదయం 9:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగనుంది. ఉపాధ్యాయుల హాజరు ఆన్‌లైన్ ద్వారా తీసుకుంటారు. శిక్షణకు ఎవరూ డుమ్మా కొట్టకుండా కేంద్రాల్లో జియో ట్యాగింగ్ ఏర్పాటు చేశారు. శిక్షణకు హాజరయ్యే టీచర్లకు మధ్యాహ్న భోజనంతోపాటు రెండు పూటలా టీ, స్నాక్స్ ఇవ్వనున్నారు. ఈ శిక్షణ స్కూల్ అసిస్టెంట్లకు రెండు విడతల్లో జిల్లా కేంద్రాల్లో ఇవ్వనున్నారు. ఎస్‌జీటీలకు మండల కేంద్రాల్లో ఈ నెల 19 నుంచి నిర్వహించనున్నారు.

జిల్లా కేంద్రాల్లో..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 3,227 ప్రభుత్వ పాఠశాలల్లో 12,854 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. మహబూబ్‌నగర్, వనపర్తి, జోగుళాంబ గద్వాల, నారాయణపేట, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో ఇచ్చే శిక్షణకు మహబూబ్‌నగర్ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ మెరజుల్లా ఖాన్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. ఆయా జిల్లాల విద్యాశాఖ అధికారులు, ఏఎంవోల ఆధ్వర్యంలో శిక్షణ కొనసాగనుంది.



డీఆర్పీలతో శిక్షణ ఏర్పాట్లపై మాట్లాడుతున్న డైట్ ప్రిన్సిపాల్, శిక్షణ ఇన్‌చార్జి మెరజుల్లాఖాన్

మహబూబ్‌నగర్ జిల్లాలో 750 మందికి..

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని భగీరథ కాలనీలో గల జేపీఎన్ఎస్ కళాశాలలో మంగళవారం నుంచి ఈ నెల 17 వరకు మొదటి విడత శిక్షణ ఇవ్వనున్నారు. స్కూల్ అసిస్టెంట్స్ ఆంగ్లం, సాంఘిక శాస్త్రం, గణితం సబ్జెక్టులతో పాటు మండల స్థాయిలో ఎస్‌జీటీలకు శిక్షణ ఇచ్చే డీఆర్పీలకు కూడా శిక్షణ ఇస్తారు. జిల్లాలో 750 మంది ఉపాధ్యాయులు శిక్షణకు హాజరు కానున్నారు. అందులో 690 మంది స్కూల్ అసిస్టెంట్స్, 60 మంది మండల స్థాయిలో ఎంఆర్పీలుగా శిక్షణ ఇవ్వనున్న ఎస్‌జీటీలు ఉన్నారు.

నారాయణపేట జిల్లాలో..

నారాయణపేట జిల్లాలో మొదటి విడతలో స్కూల్ అసిస్టెంట్స్ గణితం ఉపాధ్యాయులు 176 మంది, సాంఘిక శాస్త్రం 162 మంది, ఉర్దూ మీడియం ఎస్‌జీటీలు 55 మంది, మండలాల నుంచి ఎంపికైన ఆర్పీలు 102 మందికి శిక్షణ ఇవ్వనున్నారు.

మత్తుపదార్థాల వినియోగంపై దృష్టి సారించాలి

- అదనపు కలెక్టర్ వేంకటేశ్వర్లు



మత్తు పదార్థాల నివారణ కోరుతూ ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, మే 12 (ఆంధ్రజ్యోతి) : మత్తు పదార్థాలను వినియోగిస్తున్న విద్యార్థులపై దృష్టి సారించి, మత్తు పదార్థాలు సేవించడం వల్ల జరిగే అనర్థాలపై అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు సూచించారు. వనపర్తిని నషాముక్తి జిల్లాగా మార్చేందుకు ప్రతీ ఒక్కరు తమ వంతు కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు. సోమవారం ప్రజావాణి హాల్లో జరిగిన జిల్లా స్థాయి నార్కోటిక్, నషాముక్త్ భారత్ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ పలు సూచనలు చేశారు. మత్తు పదార్థాలు సేవించడం వల్ల జరిగే అనర్థాలపై యువతకు అవగాహన కల్పించాలని, విద్యాశాఖ అధికారులతో పాటు తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలని తెలిపారు. అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) యాదయ్య మాట్లాడుతూ... తమ పిల్లలు మత్తుపానీయాల బారిన పడకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని, పిల్లలపై నిఘా వేసి ఉంచాలని కోరారు. డీసీఆర్‌బీ డీఎస్పీ ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ... జిల్లాలో 2017 నుంచి గంజాయి కేసులు నమోదు అవుతు న్నాయని తెలిపారు. ఇటీవల వీపనగండ్ల మండలంలో ఒక పశువుల కాపరి గడ్డి వాములో గంజాయి దాచిపెట్టి ఉంచిన ఉదంతం బయటికి వచ్చిందన్నారు. గంజాయి సేవించే వారు, రవాణా చేసే వారిపై పోలీస్ శాఖ గట్టి నిఘా వేసి ఉంచిందని, దొరికిన వెంటనే కేసులు బుక్ చేసి జైలుకు పంపిస్తున్నట్లు తెలిపారు. మత్తు పదార్థాల నివారణకై అదనపు కలెక్టర్ యాదయ్య అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. జిల్లా సంక్షేమ అధికారిసు ధారాణి, పీడీఈఆర్‌డీవో ఉమాదేవి పాల్గొన్నారు.

విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్లు

- మంత్రి జూపల్లి కృష్ణారావు

కల్వకుర్తి, మే 12 (ఆంధ్రజ్యోతి) : అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లను విడతల వారీగా మంజూరు చేస్తామని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గుడిసెలు లేని తెలంగాణే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. కల్వకుర్తి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి అధ్యక్షతన సోమవారం నియోజకవర్గంలోని ఇందిరమ్మ కమిటీ సభ్యులు, ఎంపీడీవోలతో సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ ప్రజా సంక్షేమ అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. నియోజకవర్గంలో 3500 ఇళ్లు ప్రభుత్వం మంజూరు చేసిందని పేర్కొన్నారు. గ్రామాల్లో నిరుపేదలు, ఇళ్లు లేని అర్హులైన లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండాలని సూచించారు. ఇందిరమ్మ లబ్ధి దారులను, రాజీవ్ యువ వికాసంలో లబ్ధిదారుల ఎంపికలో ఎమ్మెల్యేనే ఫైనల్ అని మంత్రి తెలిపారు. కాంగ్రెస్ కార్యకర్తలకు తాము ఎల్లప్పుడు అండగా ఉంటామని మంత్రి హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో అర్హులైన లబ్ధిదారులను ఇందిరమ్మ ఇళ్లకు మొదటి విడతలో ఎంపిక చేయాలని సూచించారు. మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్, కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్, కల్వకుర్తి మాజీ జడ్పీటీసీ చిమ్ముల శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీడీవో వెంకట్రాములు, నాయకులు సంజీవ్‌కుమార్‌యాదవ్, షానవాజ్‌ఖాన్, విజయ్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, జిల్లెల రాములు, నియోజకవర్గంలోని ఎంపీడీవోలు, ఇందిరమ్మ కమిటీల సభ్యులు, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

పాలిసెట్‌కు సర్వం సిద్ధం

మహబూబ్‌నగర్ విద్యావిభాగం/నారాయణపేట/గద్వాల సర్కిల్/నాగర్‌కర్నూల్ టౌన్/వనపర్తి విద్యావిభాగం, మే 12 (ఆంధ్రజ్యోతి): పాలిసెట్‌కు ఉమ్మడి జిల్లా అధికారులు ఏర్పాట్లు చేశారు. మంగళవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 వరకు పరీక్ష నిర్వహించనున్నారు. ఉమ్మడి జిల్లాలో 32 కేంద్రాలను ఏర్పాటు చేయనుండగా, 12,104 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. ఇప్పటికే పరీక్ష నిర్వహణకు చీఫ్ సూపరింటెండెంట్లు, అబ్జర్వర్లకు పరీక్ష నిర్వహణపై అవగాహన కల్పించారు. విద్యార్థులు గంట ముందే కేంద్రాలకు చేరుకోవాలని మహబూబ్ నగర్ జిల్లా పాలిసెట్ పరీక్షల కన్వీనర్ మోహన్‌బాబు సూచించారు.

పాలిసెట్‌కు ఏర్పాటు చేసిన కేంద్రాలు, హాజరు కానున్న విద్యార్థుల వివరాలు

జిల్లా	కేంద్రాలు	అభ్యర్థులు
మహబూబ్‌నగర్	5	3,381
నాగర్‌కర్నూల్	8	2,805
నారాయణపేట	5	1,382
వనపర్తి	10	2,756
గద్వాల	4	1,780

చెత్త నుంచి సంపద సృష్టేది?



పులికల్ గ్రామపంచాయతీలోని డంపింగ్ యార్డులో కాలుతున్న తడి,పొడి చెత్త

- మునిసిపాలిటీ, పంచాయతీల్లో తూతూ మంత్రంగా తడి, పొడి చెత్త నిర్వహణ
- సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుల్లో తగులబెడుతున్న కార్మికులు
- జిల్లాలో రోజుకు పారిశుధ్య కార్మికులు సేకరిస్తున్న చెత్త 36.25 మెట్రిక్ టన్నులు
- నిర్వహణపై దృష్టి సారిస్తే ఏడాదికి రూ, 2.35 కోట్ల ఆదాయం వచ్చే అవకాశం
- ఏదో ఒక గ్రామంలో నామమాత్రంగా నిర్వహించి నివేదికలు పంపుతున్న అధికారులు

పల్లెలు, పట్టణాలు పరిశుభ్రంగా ఉండాలన్న ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పల్లె ప్రగతి పేరిట డంపింగ్‌యార్డులను నిర్మించాయి. అందులో భాగంగానే జోగులాంబ గద్వాల జిల్లాలో రూ.9.37 కోట్లు ఖర్చు పెట్టి సెగ్రిగేషన్ షెడ్లు (డంపింగ్ యార్డులు) నిర్మించారు. అయితే, ప్రభుత్వాల లక్ష్యం అధికారుల నిర్లక్ష్య ధోరణితో నీరుగారిపోతున్నది. జిల్లా వ్యాప్తంగా ఒకటి రెండు చోట్ల తప్పితే అన్ని చోట్ల ప్రతీరోజు ఉదయం సేకరించిన తడి, పొడి చెత్తను డంపింగ్ యార్డుల్లో పారబోయటం తగులబెట్టడం నిత్యకృత్యమైంది. ఒకటి రెండు చోట్ల తయారు చేస్తున్న సేంద్రియ ఎరువుకు సంబంధించిన నివేదికను ప్రభుత్వానికి పంపి అధికారులు చేతులు దులిపేసుకుంటుండటం గమనార్హం.

6

- అయిజ టౌన్, (ఆంధ్రజ్యోతి)

రైతును కంటికి రెప్పలా కాపాడుకుంటాం



మాట్లాడుతున్న చిన్నారెడ్డి

గోపాల్‌పేట, మే 12 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులను కంటికి రెప్పలా కాపాడుకుంటామని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని మున్ననూరు గ్రామంలో నిర్వహించిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ... రైతుల సమస్యలు క్షేత్రస్థాయిలో తెలుసుకున్నందుకే ప్రభుత్వం ప్రతీ గ్రామంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమాన్ని ముందుకు తీసుకొచ్చిందన్నారు. వ్యవసాయ రంగంలో ఆధునిక పనిముట్ల వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని, రైతులు పెట్టుబడి తగ్గించడంలో ఆధునిక పనిముట్లు యంత్రాలు కీలకంగా ఉపయోగపడుతున్నాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి రూ.54వేల కోట్లు ఖర్చు పెట్టిందన్నారు. శాస్త్రవేత్తలు మాట్లాడుతూ... రైతులు పంట మార్పిడి పద్ధతిని పాటించాలని పంటలపై రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలని అన్నారు. అనంతరం విశ్వ విద్యాలయ శాస్త్రవేత్తలను చిన్నారెడ్డి శాలువాతో సన్మానించారు. విశ్వ విద్యాలయ శాస్త్రవేత్తలు, మండల సింగిల్‌విండో డైరెక్టర్ లోడే రఘు, గ్రామ మాజీ సర్పంచ్ శేఖర్ నాయకులు దీరమల్లు గోవర్ధన్ రెడ్డి, సత్యం, రాములు, రమేష్, అంజి, నరేందర్ రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పర్యటనకు ముమ్మరంగా ఏర్పాట్లు

6



మాచారంలో సీఎం సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

చేనేత కళా నైపుణ్యానికి ప్రోత్సాహం

- డిజైనింగ్, వీవింగ్ కేటగిరీల్లో అవార్డులు
- రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహకంతో కార్మికుల్లో ఉత్సాహం



7

అమరచింతలో మగ్గంపై పట్టు చీర నేస్తున్న దంపతులు

ఆత్మహత్యాయత్నం కలకలం

- ఎస్పీ ఆఫీస్ ఎదుట పెట్రోల్ పోసుకున్న ఓ కుటుంబం



ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతున్న శంకర్

వనపర్తి, మే 12 (ఆంధ్రజ్యోతి): ఆస్తుల పంపకాల విషయంలో గత కొంతకాలంగా తన సొంత అన్నతో పాటు, మేనమామలు వేధిస్తున్నారని ఓ వ్యక్తి కుటుంబ సభ్యులతో కలిసి జిల్లా పోలీస్ కార్యాలయం ముందు పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి యత్నించడం జిల్లాలో కలకలం సృష్టించింది. సోమవారం ఉదయం ప్రజావాణిలో భాగంగా బాధితుడు పట్టణంలోని జంగాల గుట్టకు సిరివాటి శంకర్ తన కుటుంబ సభ్యులతో కలిసి ఎస్పీ కార్యాలయం ముందు ఇద్దరు పిల్లలు, భార్యపై పెట్రోల్ పోసి ఆత్మహత్యాయత్నం చేసుకునేందుకు ప్రయత్నించాడు. ఆ పక్కనే విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుళ్లు పెట్రోల్ డబ్బా తీసుకుని ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. బాధితుడిని ఎస్పీ రావుల గిరిధర్ తన ఛాంబర్‌లోకి పిలిచి రూరల్ పోలీసులను సంప్రదించాలని సూచించారు. ఈ విషయంపై బాధితుడు సిరివాటి శంకర్ మాట్లాడుతూ తన సొంత అన్న సిరివాటి కృష్ణయ్య, సిరివాటి శంకర్ అనే మేమిద్దరం అన్నదమ్ములం. మాకు తల్లిదండ్రులతో పాటు మేము సంపాదించిన ఆస్తులను పెద్దల సమక్షంలో పంపకాలు చేసుకున్నాం. అయితే అందులో ఒక ప్రభుత్వ ప్లాట్ రూ.2 లక్షల డబ్బుల విషయంలో తనకు అన్యాయం చేశారని, తన మేనమామలు, అన్న మోసం చేశారని తెలిపారు. ఇటీవలే మా మేనమామలు విభూది నారాయణ, విభూది చిన్న వెంకటయ్య, విభూది ఎల్లయ్య, మా అన్న వేధించారని వాపోయాడు. దీంతో కుటుంబ సభ్యులతో కలిసి పెట్రోల్ పోసుకుని ఆత్మ హత్య చేసుకునేందుకు ఎస్పీ కార్యాలయానికి వచ్చినట్లు తెలిపారు. ఈ విషయంపై రూరల్ ఎస్ఐ జలంధర్ రెడ్డిని వివరణ కోరగా బాధితుడు ఫిర్యాదు చేశాడని, పూర్తిస్థాయిలో విచారణ చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రూ. 80 లక్షల లోన్ వస్తుందని..

అలంపూరుచౌరస్తా, మే 12 (ఆంధ్రజ్యోతి): రూ.80 లక్షల లోన్ వస్తుందని ఉన్న నగదంతా సమర్పించుకుని మోసపోయిన ఘటన ఉండవల్లి మండలం కలుగొట్ల గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. సదరు గ్రామానికి చెందిన కుర్వమహేష్ అనే వ్యక్తి మార్చి నెల 31న ఫేస్‌బుక్‌లో వచ్చిన ఓ సందేశాన్ని చూసి అందులో ఉన్న నెంబరుకు కాల్ చేశాడు. అవతలి వారు మీకు లోన్ కావాలా అని అడగడంతో కావాలని చెప్పాడు. ఏప్రిల్ 1న మరో అపరచిత వ్యక్తి కాల్ చేసి లోన్ దరఖాస్తు ప్రాసెస్ చేయడానికి రూ.2 వేల ఫీజు చెల్లించాలని, మరికొన్ని ఫీజులు అవసరమని.. మొత్తం ఆరోజు రూ.10వేలు లాగేశారు. ఏప్రిల్ 3న మరో వ్యక్తి కాల్ చేసి భూమి యాజమాన్యపు వివరాలు రాబట్టి మీకు రూ.80లక్షల వరకు లోన్ వస్తుందని, అందుకు రిజిస్ట్రేషన్ నిమిత్తం రూ.26789లు తమ అకౌంటుకు వేయమని చెప్పగానే వెంటనే సమర్పించుకున్నాడు. మొత్తం రూ. 4.12లక్షలు సమర్పించుకున్నాడు. లోన్ వస్తుందని ఎదురు చూసిన బాధితుడు మోసపోయానని సోమవారం ఉండవల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేష్ తెలిపారు.

గద్వాలలో 40.8 డిగ్రీల ఉష్ణోగ్రత

గద్వాల/నారాయణపేట/వనపర్తి, మే 12 (ఆంధ్రజ్యోతి) ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఎండల తీవ్రత కొనసాగుతోంది. సోమవారం జోగుళాంబ గద్వాల జిల్లాలో మళ్లీ ఎండలు దంచి కొట్టాయి. గద్వాలలో 40.8 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. అయిజలో 40.3, ఇటిక్యాల, గట్టులలో 40.1, మల్దకల్‌లో 39.9, రాజోలిలో 39.9, వడ్డేపల్లిలో 39.8, అలంపూర్‌లో 39.3, ధరూర్‌లో 39.2 డిగ్రీలు నమోదయ్యాయి. కనిష్ఠ ఉష్ణోగ్రత 27 డిగ్రీలు నమోదైంది. వనపర్తి జిల్లా గోపాల్‌పేటలో గరిష్ఠం 40.3 డిగ్రీలు నమోదైంది. కొత్తకోట మండలంలో 40.2 డిగ్రీలు నమోదైంది. వనపర్తి మండలంలో కనిష్ఠం 28.4 డిగ్రీలు నమోదయింది. మహబూబ్‌నగర్ జిల్లాలో గరిష్ఠం 39.5, కనిష్ఠం 28 డిగ్రీలు, నాగర్‌కర్నూలు జిల్లాలో గరిష్ఠం 37, కనిష్ఠం 26 డిగ్రీలు, నారాయణపేట జిల్లాలో గరిష్ఠంగా 36 డిగ్రీలు, కనిష్ఠం 26 డిగ్రీలు నమోదైంది.

పీయూ పరీక్షల నియంత్రణ అధికారిగా ప్రవీణ


పీయూ ఉపకులపతి ఆచార్యశ్రీనివాస్ నుంచి నియామకప్రతం అందుకుంటున్న ప్రవీణ

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, మే 12 (ఆంధ్రజ్యోతి): పాలమూరు యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారిగా భౌతిక శాస్త్ర విభాగానికి చెందిన డాక్టర్ కె.ప్రవీణను నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. సోమవారం పీయూ ఉపకులపతి ఆచార్య శ్రీనివాస్ నియమక ఉత్తర్వులను ఆమెకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పరీక్షల నియంత్రణ అధికారిగా బాధ్యతలు అప్పజెప్పినందుకు వీసీ, రిజిస్ట్రార్ పూస రమేష్ బాబులకు కృతజ్ఞతలు తెలిపారు. గతంలో కూడా పరీక్ష విభాగం అదనపు నియంత్రణ అధికారిగా పని చేసినట్లు పేర్కొన్నారు.

కొనసాగుతున్న ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ పరీక్షలు


పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం మే 12 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు యూనివర్సిటీ పీజీ కళాశాలలో ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ 8వ సెమిస్టర్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. సోమవారం పరీక్షా కేంద్రాన్ని పరీక్షల నియంత్రణ అధికారి ప్రవీణ, అదనపు నియంత్రణ అధికారి డాక్టర్ శాంతిప్రియ, ఛీఫ్ సూపరింటెండెంట్ డాక్టర్ మధుసూ దన్‌రెడ్డి పరిశీలించారు.

భార్యను వేధిస్తున్నాడని.. తండ్రిని చంపిన తనయుడు


బుచ్చయ్య (ఫైల్)

నవాబ్‌పేట, మే 12 (ఆంధ్రజ్యోతి) : తాను ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్యను తరచూ తండ్రి వేధిస్తుండడం భరించలేని ఓ కొడుకు గొడ్డలితో నరికి చంపిన ఘటన మహబూబ్‌నగర్ జిల్లా నవా బ్‌పేట మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి ఎరుకలి బుచ్చయ్య, కుమారుడు యాదయ్య కొంతకాలం క్రితం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం పాలకొ ండకు చెందిన ఓ అమ్మాయిని ప్రేమించి పెళ్లి చే సుకున్నాడు. ఇది సహించని తండ్రి బుచ్చయ్య(52) నిత్యం వేధించేవాడు. అయితే రోజు మాదిరిగా తన కోడలిని సాయంత్రం వేధించడంతో ఆమె భర్త యాదయ్యకు ఫోన్ చేసి చెప్పింది. క్షణికావేశానికి గురైన యాదయ్య తండ్రిని తల్లి ఎదుటే గొడ్డలితో నరికి చంపాడు. విషయం తెలుసుకున్న పోలీసులు నిందుతుడిని అదుపులోకి తీసుకున్నారు.

తరగతి గదిలో నాగుపాము కలకలం


నాగుపామును పట్టుకొని బంధిస్తున్న కష్ణ సాగర్

వనపర్తి రూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి పట్టణ పరిధిలోని మర్రికుంట ఎస్టీ గురుకుల హాస్టల్ ఒక తరగతి గదిలో సోమవారం నాగుపాము కలకలం రేపింది. రోజు మాదిరిగా విద్యార్థులు తరగతి గదిలోకి వెళ్తుండగా గదిలో నాగుపా ము బుసుమని పడగలేపింది. విద్యా ర్థులు కేకలు వేస్తు గదిలో నుంచి బయటపడ్డారు. భయానికి గురైన నాగుపాము ఆటస్థలంలో ఉన్న స్టేజీ బేస్‌మెంట్ రంధ్రంలోకి దూరింది. అది గమనించిన ఉపాధ్యాయులు వెంటనే సాగర్ స్నేక్ సొసైటీ అధ్యక్షులు కృష్ణ సాగర్‌కు సమాచారం అందించారు. హుటాహుటిన కృష్ణసాగర్ ఎస్టీ హాస్టల్‌కు చేరుకుని నాగుపామును చాకచక్యంగా పట్టుకుని బంధించారు.

గుడ్డ పేలికలే గూడు

- రెండు దశాబ్దాలుగా ఎవరికీ పట్టని బేడ బుడగ జంగాల గోడు
- తమను ఓట్ల కోసమే వాడుకుంటున్నారని ఆవేదన
- స్థిర నివాసం కోసం ఎదురుచూపులు


గుడ్డపేలికలు, చీరలు, ప్లాస్టిక్ కవర్లతో బేడ బుడగ జంగాలు ఏర్పాటు చేసుకున్న గుడారాల సముదాయం


గద్వాల శివారు పిల్లిగుంట్లలో ఏర్పాటు చేసుకున్న ఓ గుడారం

గద్వాల సర్కిల్, మే 12 (ఆంధ్రజ్యోతి): బతుకుదెరువు కోసం సంచార జీవనం గడుపుతున్న నిరుపేద కుటుంబాలు అష్టకష్టాలు ఎదుర్కొంటున్నారు. సుస్థిర నివాసం లేకపోవడంతో గుడ్డ పేలికలు, చిరిగిన చీరలు, తడికెలు, ప్లాస్టిక్ కవర్లనే గుడారాలుగా మార్చుకుని చిన్నపాటి వృత్తులతో తమ కుటుంబాలను భారంగా మోస్తూ కాలం గడుపుతున్నారు. సుమారు రెండు దశాబ్దాలుగా గుడారాల మధ్యే జీవనం కొనసాగిస్తున్న బేడ బుడగ జంగాల జీవన పయనంపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

దయనీయ పరిస్థితి

బేడ బుడగ జంగాలది అనాదిగా యాచక వృత్తియే వారి సహజ జీవనశైలి. పగటి వేషాలు, బుర్రకథలు, బాలసంతు, గుమ్మెట, తంబూరాతో హరికథలు చెబుతూ సంచార జీవనం సాగిస్తూ దయనీయ పరిస్థితుల మధ్య కుటుంబాలను పోషిస్తూ వచ్చారు. ప్రస్తుతం అత్యాధునిక సాంకేతిక విప్లవాత్మక మార్పులు, మొబైల్, సామాజిక మాధ్యమాల వినియోగం దూసుకుపోతున్న నేపథ్యంలో ఆ ప్రభావం వీరిపై పడింది. దీంతో వారు దాదాపు యాచక వృత్తిని విడిచి ప్రత్యామ్నాయంగా చిరువ్యాపారాలు, ఇంటి సామగ్రి రిపేర్లు, బిందెలు విక్రయించడం, వెంట్రుకల సేకరణ, ప్లాస్టిక్ వస్తువుల విక్రయం తదితర వ్యాపారాల నిర్వహణలో కొనసాగేందుకు మొగ్గు చూపుతున్నారు.

గద్వాలలో 450 పైగా కుటుంబాలు

గద్వాలలోని పిల్లిగుంట్ల, బీడీ కాలనీ, దౌదర్‌పల్లి, సెకండ్ రైల్వేగేట్, నది అగ్రహారం మార్గం, రాజీవ్ గృహకల్ప తదితర ప్రాంతాల్లో సుమారు 450 కుటుంబాలకు పైగానే బేడ బుడగ జంగాలు గుడ్డ పేలికలు, ఇతర వస్తువులను పేర్చి గుడారాలు ఏర్పాటు చేసుకుని కాలం వెళ్లదీస్తున్నారు. కొందరు రాజకీయ నాయకులు కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే కడుపునింపే మాటలతో కవ్వించి ఆ తర్వాత వారి వైపు చూడకుండగా ఉంటున్నారనే తీవ్ర విమర్శలు బాహాటంగానే ఉన్నాయి. తమకు స్థిర నివాసం కల్పించాలని ప్రజాప్రతినిధులను, జిల్లా అధికారులను కలిసి విన్నవించినా ఎలాంటి స్పందన రాకపోవడంతో తప్పని పరిస్థితుల్లో దయనీయమైన జీవన పోరాటాన్ని కొనసాగిస్తున్నారు.



మా గోడు విని ఆదుకోవాలి

బేడ బుడగ జంగాల బతుకులు దయనీయంగా ఉన్నాయని ప్రజా ప్రతినిధులకు, అధికారులకు చెబుతూ వస్తున్నాం. అయినా పరిస్థితిలో ఎలాంటి మార్పు లేదు. గుడారాల్లోనే గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటున్నాం. బ్యాంకు రుణాలు, ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చి మాకు అండగా నిలవాలి. సమయం చూసుకుని ప్రజాప్రతినిదులు, అధికారులు గుడారాల్లోకి వచ్చి మా గోడు వినాలి.

- సిరివాటి కృష్ణ, పిల్లిగుంట్ల, గద్వాల



మా కష్టాలు గుర్తించాలి

మా కష్టాలు ప్రభుత్వం గుర్తించి ఆదుకోవాలి. ఇల్లు లేక గుడారాలతో ఏళ్ల తరబడి సావాసం చేస్తున్నాం. ఆర్థిక ఇబ్బందులు కూడా ఉన్నాయి. నా కొడుకు మృతితో మానసికంగా బాధడుతున్నా.. కోడలు ఇంటి నుంచి వెళ్లిపోయింది. దీంతో ఇద్దరు మనవళ్లు, మనవరాళ్లు నా దగ్గరే ఉన్నారు. వారి భవిష్యత్‌కు ప్రభుత్వమే బాధ్యత తీసుకోవాలి.

- సుదర్శనమ్మ, పిల్లిగుంట్ల, గద్వాల

పరిష్కారమే తరువాయి


ఫిర్యాదుల పరిష్కార కమిటీతో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ సమావేశం

(5వ పేజీ తరువాయి)

281 వరకు వచ్చాయి. అందులో ఓఆర్‌సీ, తల్లిదండ్రుల పేరు మార్పు, ఏం పద్ధతిలో భూమి సంక్రమించిందనే విషయాలపై ఫిర్యాదులు ఉన్నాయి. ఈ నెల మొదటి వారం నుంచే వచ్చిన ఫిర్యాదులకు సంబంధించి అధికారులు పరిశీలన చేపట్టారు. సమస్య సరైనదేనా?, పరిష్కరించడానికి మార్గాలు ఉన్నాయా? లేదా అనే విషయాలను పరిశీలించారు. ఫిర్యాదుదారులు, కక్షిదారులకు నోటీసులు కూడా అందజేశారు. 10 రోజుల్లోగా సమస్యపై వివరణ కూడా కోరారు.

20లోగా పరిష్కారం

భూ భారతి చట్టం అమలులో భాగంగా పైలట్ మండలం మద్దూరులో వచ్చిన ఫిర్యాదులను ఈనెల 20వ తేదీలోగా పరిష్కరించాలని అధికారులు లక్ష్యం నిర్ణయించుకున్నారు. గతంలో రాష్ట్రవ్యాప్తంగా ఐదు పైలట్ మండలాలను ప్రభుత్వం ఎంపిక చేసి, ఫిర్యాదులు స్వీకరించగా, ఇప్పుడు జిల్లాకు పైలట్ మండలంలో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. మద్దూరులో చేసిన విధానాన్ని ప్రామాణికంగా తీసుకుని మిగతా మండలాల్లో కూడా అమలు చేయనున్నారు. జూన్ 2 నాటికి అన్ని పైలట్ మండలాల్లో సమస్యలు పరిష్కరించి, నూతన పోర్టల్ ప్రారంభానికి చర్యలు తీసుకోనున్నారు. భూ భారతి అవగాహన సదస్సుల సందర్భంగా రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి 100 మంది సర్వేయరను నియమించి, భూ సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. పైలట్ మండలం మద్దూరులో 1,341 ఫిర్యాదుల పరిష్కారానికి 7 బృందాలను కలెక్టర్ సిక్తా పట్నాయక్ నియమించారు. ఒక్కో బృందంలో ఒక డిప్యూటీ తహసీల్దార్, ఒక రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, ఒక సర్వేయర్ ఉంటారు. వీరు పరిశీలించిన 1,341 ఫిర్యాదులకు సంబంధించి క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలన చేసి, అక్కడికక్కడే పరిష్కార మార్గం చూపనున్నారు. సమస్య సరైనది కాకపోయిన, వివాదాస్పదమైన విషయాలను రిపోర్టుగా తయారు చేసి, అధికారులకు నివేదిస్తారు. ఆ తరువాత వాటిపై చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. ప్రధానంగా సాదాబైనామాలకు సంబంధించి కాస్తులో ఉన్నారా? లేదా? అనేది పరిశీలించడంతో పాటు చుట్టుపక్కల భూముల వారితో విచారణ చేస్తారు. తరువాత సాదాబైనామాలను కూడా పరిశీలించి, తరువాత పట్టాదారు పాసు బుక్కు అందజేసే అవకాశం ఉంది.

పది రోజుల్లో భూసమస్యల పరిష్కారం



భూ భారతి కొత్త చట్టం అమలు కోసం పైలట్ ప్రాజెక్టు కింది ఎంపికైన మద్దూర్ మండలంలో భూ సమస్యల పరిష్కారానికి నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన 1,341 దరఖాస్తుల పరిశీలన పూర్తయ్యింది. దరఖాస్తుదారులకు నోటీసులు కూడా అందించాం. జిల్లా అధికారుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 7 కమిటీలు క్షేత్రస్థాయికి వెళ్లి, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాయి. ఈ నెల 20లోపు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

- జయరాములు, ఇన్‌చార్జి తహసీల్దార్, మద్దూర్

ముఖ్యమంత్రి పర్యటనకు ముమ్మరంగా ఏర్పాట్లు

- 50 ఎకరాల విస్తీర్ణంలో 13 బోర్ల డ్రిల్లింగ్
- మాచారంలో సభా ప్రాంగణం, హెలిప్యాడ్ పనులను పరిశీలించిన కలెక్టర్, ఎమ్మెల్యే

మన్ననూర్, మే 12 (ఆంధ్రజ్యోతి) : ఇందిరా సౌర గిరిజల వికాసం పథకాన్ని ప్రారంభించేందుకు నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలంలోని మాచారం గ్రామంలో ఈ నెల 18న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రానున్నారు. ఈ నేపథ్యంలో అధికార యంత్రాంగం ప్రత్యేక ఏర్పాట్లు చేసే పనుల్లో నిమగ్నమయ్యారు. కలెక్టర్ బదావత్ సంతోష్, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ సోమవారం మాచారం గ్రామాన్ని సందర్శించారు. చెంచు గిరిజనుల మెరుగైన జీవనం కోసం చేపట్టే ఇందిరా సౌర గిరిజల వికాసం పథకానికి సంబంధించి పనులను వేగంగా చేపట్టాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. సీఎం సభా స్థలం, హెలిప్యాడ్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆర్‌వోఎఫ్‌ఆర్‌కు సంబంధించిన 50 ఎకరాల విస్తీర్ణంలో గల భూముల్లో 13 ప్రదేశాల్లో బోర్లను డ్రిల్లింగ్ చేశామని, నీళ్లు పుష్కలంగా పడ్డాయని కలెక్టర్ తెలిపారు. రెడ్కో అధికారులు బోర్లకు సౌర విద్యుత్‌ను అందించే పనులను కొనసాగిస్తున్నారని చెప్పారు. జిల్లా ఉద్యానవన శాఖ అధికారులు రైతుల పొలాల్లో పండ్ల మొక్కలు నాటడానికి మార్కింగ్ చేసి గుంతలు తీసే పనులు చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 2.10 లక్షల పోడు వ్యవసాయం చేసే చెంచు గిరిజన రైతులకు మేలు జరిగే కార్యక్రమం సీఎం పుట్టి పెరిగిన గడ్డ నుంచే ప్రారంభించడం హర్షణీయమని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో డీఎఫ్‌వో, ఐటీడీఏ ఇన్‌ఛార్జి పీవో రోహిత్ గోపిడి, డీటీడీవో ఫిరంగి, భూగర్భ జల శాఖ ఏడీ దివ్య, డీపీవో రామ్మోహన్ రావు, డీఎస్పీ శ్రీనివాసులు, ఉద్యానవన శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ క్రికెటర్లను వెలికితీసేందుకు కృషి

- ఉమ్మడి జిల్లా అండర్ 19, 23 జట్ల ఎంపికలు
- జిల్లా క్రికెట్ సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్



మాట్లాడుతున్న ఎం.రాజశేఖర్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్ మే 12 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ క్రికెటర్లను వెలికితీసేందుకు హెచ్‌సీఏ ఉమ్మడి జిల్లాలో ఐదు చోట్ల వేసవి శిబిరాలు నిర్వహించిందని జిల్లా క్రికెట్ సంఘం ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు ఉమ్మడి జిల్లాలో అండర్-19, 23 జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. 14న ఎండీసీఏ మైదానంలో, జడ్చర్ల మినీ స్టేడియం, 15న నారాయణపేట మినీస్టేడియం, నాగర్‌కర్నూల్ జిల్లా నల్లవెల్లి రోడ్డు క్రికెట్ అకాడమీ, 16న వనపర్తి జిల్లా పెబ్బేరు మునిసిపల్ మైదానం, గద్వాల ఇండోర్ స్టేడియం సమీపంలో గల బాలుర హై స్కూల్‌లో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు ఎంపికలు నిర్వహిస్తారని తెలిపారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులతో ఆరు జట్లు ఎంపిక చేసి, ఒక్కో జట్టు ఐదు మ్యాచ్‌లు ఆడేలా ఈ నెల 19 నుంచి టోర్నీ నిర్వహిస్తామని చెప్పారు. ప్రతిభ చాటితే రాష్ట్రస్థాయి రెండు లీగ్ టోర్నీకి ఉమ్మడి జిల్లా జట్టును ఎంపిక చేస్తామన్నారు. త్వరలో 14 నియోజవర్గాల జట్లతో ఎంపీఎల్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ క్రీడాకారులకు సువర్ణ అవకాశం అని, అవకాశన్ని సద్వినియోగం చేసుకొని ప్రతిభ చాటాలన్నారు.

తరుగు పేరుతో మోసం చేస్తున్న ప్రభుత్వం


- ప్రతీ రైతుకు గన్నీ బ్యాగులు ఇవ్వాలి
- కలెక్టరేట్ ఎదుట బీఆర్‌ఎస్ నాయకుల ధర్నా


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు, నాయకులు

గద్వాల క్రైం, మే 12 (ఆంధ్రజ్యోతి): తరుగు పేరుతో రైతులను నిట్టనిలువుగా ప్రభుత్వం దోపిడీ చేస్తుందని బీఆర్‌ఎస్ నాయకుడు నాగర్‌దొడ్డి వెంకట్రాములు, బీఆర్‌ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ కుర్వ పల్లయ్య ఆరోపించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట రైతులకు మద్దతుగా బీఆర్‌ఎస్ నాయకులు ధర్నా చేపట్టారు. జిల్లాలోని 69 ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో భారీ ఎత్తున నిర్వాహకులతో పాటు కాంగ్రెస్ నాయకులు దోపిడీ చేస్తున్నారన్నారు. తరుగు పేరుతో క్వింటాల్‌కు 2 కేజీలు అదనంగా ధాన్యం తీయడం దుర్మార్గమని, దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. అలాగే వర్షాలతో రైతులు ఇబ్బందులు పడకుండా వెంటనే గన్నీ బ్యాగులు ఇచ్చి ధ్యాన్యాన్ని కాంటా వేసి మిల్లులకు తరలించాలన్నారు. కర్ణాటక, రాయలసీమ నుంచి వచ్చే ధాన్యాన్ని ఇక్కడ కొంతమంది దళారులు కాంటా వేసి సొమ్ము చేసుకుంటున్నారని, దీనిపై దృష్టి సారించాలన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నవాజ్, మైబు, మక్బూల్, ఆంజనేయులు, ప్రకాష్, శేఖర్, ఆంజనేయులు, దస్తగిరి, నాగరాజు, రాఘవ, గోవిందు, తేజ, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

అదనపు నష్టపరిహారం చెల్లించాలి

- భారత్‌మాల రోడ్డుపై ధర్నా చేపట్టిన రైతులు


భారత్‌మాల రహదారిపై ధర్నాకు కూర్చున్న రైతులు

అయిజ, మే 12 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండలంలోని దేవబండ గ్రామ రైతులు సోమవారం ధర్నాకు దిగారు. దేవబండ పంచాయతీ పరిధిలో భారత్‌మాల రహదారి వెళ్లింది. దాదాపు 33 ఎకరాల భూమిని రహదారి కోసం వాడుకుంటున్నారు. దీనికి సంబంధించిన 90 మంది రైతులకు మొదటి విడత కింద భూ నష్ట పరిహారం అందించారు. పంట పొలంలో ఉన్న బోర్లు, బావులు, చెట్లకు సంబంధించిన నష్ట పరిహారం అందలేదంటూ.. మాకు న్యాయం చేయాలంటూ రహదారిపై బైఠాయించి ధర్నాకు దిగారు. కార్యక్రమంలో రైతులు జయన్న, నర్సింహులుగౌడ్, రమేష్, వెంకన్న, వెంకటేష్, వెంకటస్వామి, తిక్కన్న, రాముడు పాల్గొన్నారు. సాయంత్రం రైతులందరూ జిల్లా కేంద్రంలోని కలెక్టర్ సంతోష్‌ని కలిసి సమస్యను వివరించడంతో, న్యాయం చేస్తానని హామీ ఇవ్వటంతో వెనుతిరిగినట్లు రైతులు తెలిపారు.

చెత్త నుంచి సంపద సృష్టేది.?

- మునిసిపాలిటీ, పంచాయతీల్లో తూతూ మంత్రంగా తడి, పొడి చెత్త నిర్వహణ
- సేకరించిన తడి, పొడి చెత్తను డంపింగ్ యార్డుల్లో తగులబెడుతున్న కార్మికులు



అయిజ మునిసిపాలిటీలో నిర్మించిన పొడి వ్యర్థాల సేకరణ కేంద్రం

అయిజ టౌన్, మే 12 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా గ్రామాలు, పట్టణాలు పరిశుభ్రంగా ఉండాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో ప్రణాళికలు చేస్తున్నప్పటికీ కొందరు అధికారుల మూలంగా ఆ ప్రణాళికలు సక్రమంగా అమలు కావటం లేదు. 2021లో గత ప్రభుత్వం 'పల్లె ప్రగతి' కార్యక్రమంలో భాగంగా గద్వాల జిల్లాలోని నాలుగు మునిసిపాలిటీలు, 255 గ్రామపంచాయతీల్లో రూ.9.37 కోట్లు ఖర్చు పెట్టి షెగ్రిగేషన్ షెడ్లు (డంపింగ్ యార్డులు) నిర్మించింది. వీటిలో ప్రతిరోజు ఇళ్ల నుంచి సేకరించిన తడి, పొడి చెత్తను వేరుచేసి పొడిచెత్తను విక్రయించటం ద్వారా, తడిచెత్తతో కంపోస్టు ఎరువును తయారు చేయటం ద్వా రా ఆదాయాన్ని సమీకరించుకోవాలని ప్ర భుత్వం స్థానిక అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అయినప్పటికీ ఆచరణలో మాత్రం 'చెత్తనుం చి సంపద సృష్టి' కార్యరూపం దాల్చటం లేదు. జిల్లా వ్యాప్తంగా ఒ కటి రెండు చోట్ల తప్పితే అన్ని చోట్ల ప్రతిరోజు ఉదయం సేకరించిన తడి, పొడి చెత్తను డంపింగ్ యార్డుల్లో తగులబెడుతున్నారు. ఒకటి రెండు చోట్ల తయారు చేస్తున్న సేంద్రియ ఎరువుకు సంబంధించిన నివేదికనే ప్రభుత్వానికి పంపి మమా అనిపిస్తున్నారు.

గద్వాల జిల్లాలో ఇలా...

జోగుళాంబ గద్వాల జిల్లాలోని గద్వాల, అయిజ, వడ్డేపల్లి, అలంపూర్ మునిసిపాలిటీల్లో రోజుకు 21.5 మెట్రిక్ టన్నుల చెత్తను సేకరిస్తున్నారు. అదే విధంగా జిల్లాలోని 13 మండలాల్లో రోజుకు 14.75 మెట్రిక్ టన్నుల చెత్తను సేకరిస్తున్నట్లుగా అధికారిక లెక్కల ద్వారా తెలుస్తుంది. ప్రతిరోజు సేకరించిన చెత్త నుం చి 30 శాతం వరకు సేంద్రియ ఎరువు ను తయారు చేసే అవకాశం ఉంది. బహిరంగ మార్కెట్‌లో సేంద్రియ ఎరువు రూ.6 నుంచి రూ.7 వరకు ధర పలుకుతుంది. రోజువారిగా సేకరించిన 36.25 మెట్రిక్ టన్నుల చెత్త ద్వారా తయారైన కంపోస్ట్ ఎరువుకు రోజుకు రూ.65,250 ఆదా యం రాగా, ఏడాదికి రూ. 2.35 లక్షల వరకు ఆదాయం సమకూరే అవకాశం ఉంది. పొడి చెత్త ద్వారా వచ్చే ఆదాయం అదనం. డంపింగ్ యార్డులు నిర్మించి నాలుగేళ్లు గడుస్తుండగా కొందరు అధికారుల పట్టింపు లేని కారణంగా సేంద్రియ ఎరువుల ద్వారా అదనంగా వచ్చే రూ.9.4 కోట్ల అదనపు ఆదాయాన్ని కోల్పోవలసి వచ్చింది.


నిబంధనల మేరకే సేకరిస్తున్నాం



అయిజ మునిసిపాలిటీలోని 20 వార్డుల్లో నిబంధనల మేరకు ప్రతిరోజు చెత్తను సేకరిస్తున్నాం. తడి, పొడి చెత్తను వేరు వేరుగా సేకరించాలని పారిశుధ్య కార్మికులకు ఆదేశాలు జారీ చేయటం జరిగింది. సేకరించిన చెత్తను డంపింగ్ యార్డులోకి తీసుకువెళ్లిన తరువాత తడి చెత్తతో కంపోస్టు ఎరువును తయారుచేయిస్తున్నాం. సిబ్బంది కొరతతో ఈ పనుల్లో కొంత మేరకు ఆశించిన ఫలితాలు రాలేదు. చెత్తతో ఆదాయం వచ్చేందుకు కృషి చేస్తాం.

- సైదులు, కమిషనర్, అయిజ


అదనపు ఆదాయం మంచిదే



మునిసిపాలిటీలకు గానీ, గ్రామపంచాయతీలకు గా నీ ఇటువంటి కార్యక్రమాలవల్ల అదనపు ఆదాయం రావటం చాలా మంచిది. కంపోస్టు ఎరువు కూడా రైతుల పొలాలకు చాలా బలమైన ఎరువు. రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి ఈ ఎరువును వాడి పండించిన పంట ఉత్పత్తులను తింటే రోగాలు రాకుండా కూడా ఉంటాయి.

- ఆంజనేయులు, అఖిలపక్షం కమిటీ నాయకుడు

ప్రభుత్వ ఆదేశాల మేరకు..



గత ఏప్రిల్ నెలలో పం చాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో తడి, పొడి చెత్త నిర్వహణపై వర్క్‌షాప్ నడిచింది. ప్రజల ఇళ్ల నుంచి సేకరించిన తడి చెత్త ద్వారా 30 శాతం కంపోస్ట్ ఎరువు తయారు చేయాలని నిబంధనలు చెబుతున్నాయి. తడి, పొడి చెత్తను తూకం వేసేందుకు ప్రభుత్వం త్వరలోనే తూకాలు అందజేస్తుంది.

- నాగేంద్రం, డీఎల్‌పీవో

క్రైం కార్నర్

కారు బోల్తా పడి వివాహిత మృతి

పెద్దకొత్తపల్లి, మే 12 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా పెద్దకొత్తపల్లి మండలం కల్వకోల్ వద్ద సోమవారం తెల్లవారుజామున కారు బోల్తా పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దకొత్తపల్లి మండలం సాతాపూర్ గ్రామానికి చెందిన రిటైర్డ్ ఆర్టీసీ డ్రైవర్ రాములు, భార్య శాంతమ్మ(45)తో కలిసి కారులో ఆదివారం మనువడి పుట్టిన రోజు కోసం కొల్లాపూర్ మండలం సోమశిలకు వెళ్లారు. అనంతరం సోమవారం తెలవారుజామున తిరిగి స్వగ్రామానికి వస్తుండగా కల్వకోల్ బస్టాండ్ సమీపంలో కారు ముందు టైరు పంక్చర్ కావడంతో అదుపు తప్పి పల్టీలు పడింది. శాంతమ్మకు తీవ్ర గాయాలు కావడంతో నాగర్‌కర్నూల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. కుమారుడు కడ్తాల శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ రామచంద్రయ్య తెలిపారు.

గోడ కూలి మేస్త్రి..

గట్టు, మే 12 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు మండలంలోని బల్గెర గ్రామంలో గోడ కూలి మేస్త్రి మృతి చెందిన ఘటన సోమవారం చోటు చేసుకున్నది. ఇందుకు సంబంధించి గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఏబేలు మేస్త్రీ పని చేసేవాడు. సోమవారం మండలంలోని బల్గెర గ్రామంలో చెక్ పోస్టు వద్ద ఇంటి నిర్మాణం చేపడుతుండగా అకస్మాత్తుగా గోడ కూలింది. గోడ మేస్త్రిపై పడింది. తీవ్ర గాయాలు కావడంతో వెంటనే అయిజ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం - కేసు నమోదు


ఇసరిరాముడు

జడ్చర్ల, మే 12 (ఆంధ్రజ్యోతి) : బతుకుదెరువు కోసం హైదరాబాద్ వెళ్లిన వ్యక్తి, తిరిగి స్వగ్రామానికి వస్తూ అదృశ్యం అయ్యాడు. వికారాబాద్ జిల్లా మహ్మదాబాద్ మండలం చౌదర్‌పల్లి గ్రామానికి చెందిన ఇసరిరాముడు అదృశ్యంపై సోదరుడు ఇసరి యాదయ్య సోమవారం జడ్చర్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీఐ కమలాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇసరిరాముడు, రాములమ్మ భార్యాభర్తలు. వీరు బతుకుదెరువు కోసం మార్చి 11న హైదరాబాద్ వెళ్లారు. వారి మధ్య గొడవ జరగడంతో మార్చి 17న రాత్రి హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో కారు ఎక్కాడు. అదే గ్రామానికి చెందిన చిల్లా ఆంజనేయులు కారులో ఎక్కించగా, జడ్చర్లలో రాముడు దిగినట్లుగా ఆంజనేయులు తెలుసుకుని యాదయ్యకు చెప్పాడు. నాటి నుంచి నేటి వరకు రాముడు ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో యాదయ్య ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు.

నలుగురు పిల్లలతో సహా తల్లి..

నాగర్‌కర్నూల్ క్రైం, మే 12 (ఆంధ్రజ్యోతి) : వివాహిత యాస్మిన్‌బేగం అదృశ్యంపై భర్త ముస్తాక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గోవర్ధన్ సోమవారం తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రానికి చెందిన ముస్తాక్ కొంతకాలంగా జీవనోపాధి కోసం దుబాయ్ వెళ్లాడు. గత నెల 24న జడ్చర్ల వెళ్తానని యాస్మిన్‌బేగం తన నలుగురు పిల్లలను తీసుకుని వెళ్లింది. తిరిగి ఇంటికి రాకపోవడంతో బంధువులు, తల్లిదండ్రులు, బంధువుల ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. ఈ ఘటన తెలుసుకున్న భర్త ముస్తాక్ దుబాయ్ నుంచి తిరిగి వచ్చి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

చిన్నంబావి, మే 12 (ఆంధ్రజ్యోతి): వనపర్తి జిల్లా చిన్నంబావి మండలంలోని బెక్కెం గ్రామంలో భాస్కర్‌రెడ్డి ఇల్లు విద్యుదాఘాతంతో సోమవారం దగ్ధమైంది. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పొగలు రావడం చుట్టుపక్కల వారు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కుటుంబ సభ్యులంతా బంధువుల వివాహానికి వెళ్లి వచ్చేసరికి ఇంట్లో దుస్తులు, సామగ్రి, ఆభరణాలు ఫర్నీచర్ కాలిపోయింది. ఫిర్యాదు మేరకు ఘటనా స్థలాన్ని ఎస్ఐ జగన్ మోహన్ పరిశీలించారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో పలువురికి జైలు శిక్ష

పాన్‌గల్, మే 12 (ఆంధ్రజ్యోతి) : డ్రంకెన్ డ్రైవ్ కేసులో పట్టుబడిన వ్యక్తికి వనపర్తి జిల్లా కోర్టు రెండు రోజులు జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ హిమబిందు తెలిపారు. మండలంలోని గోప్లాపూర్ గ్రామానికి చెందిన మహమ్మద్ భాష డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుపడగా కేసు నమోదు చేసి సోమవారం కోర్టులో హాజరు పరిచారు. న్యాయాధికారి రెండు రోజులు రిమాండ్, రూ.వెయ్యి జరిమానా విధించినట్లు తెలిపారు. మద్యం తాగి వాహనాలపై ప్రయాణిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ భగవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో డ్రంకన్ డ్రైవ్ నిర్వహించారు. పట్టుబడిన నలుగురిని కోర్టులో హాజరు పరిచారు. ఒకరికి ఐదు రోజుల జైలు శిక్ష, మరో ఇద్దరికి రూ 2వేలు, రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించారు. అదేవిధంగా మహబూబ్‌నగర్ వన్‌టౌన్ పరిధిలో సోమవారం రాత్రి వన్‌టౌన్ సీఐ అయ్యప్ప ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మద్యం సేవించి వాహనం నడిపిన ఇద్దరిని గుర్తించి కోర్టులో హజరుపరుచగా ఇద్దరికి రూ2వేల జరిమానతో పాటు, రెండు రోజుల జైలు శిక్షను విధించారు.

చారకొండ: డ్రంకెన్ డ్రైవ్ కేసులో పట్టుబడిన వ్యక్తికి రెండు రోజుల జైలు శిక్ష విధించారు. ఎస్ఐ శంషుద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని శాంతిగుడెం గ్రామానికి చెందిన నాగార్జున మద్యం తాగి తాగి పట్టుబడ్డాడు. సోమవారం అతడిని కల్వకుర్తి కోర్టులో హాజరు పరుచగా, న్యాయాధికారి రెండు రోజులు జైలు శిక్ష విధించారు.

కల్వకుర్తి: డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఇద్దరికి నాలుగు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ మాధవరెడ్డి తెలిపారు. వంగూరు మండలం ఉల్లంపల్లికి చెందిన నాగార్జున, కల్వకుర్తి పట్టణ పరిధిలోని తిమ్మరాసిపల్లికి చెందిన నరేందర్‌లు డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడ్డారు. వీరిని కోర్టులో సోమవారం హాజరుపర్చగా న్యాయాధికారి ఒక్కొక్కరికి నాలుగురోజుల జైలు శిక్ష, రూ.వంద జరిమానా విధించినట్లు ఎస్ఐ మాధవరెడ్డి పేర్కొన్నారు.

దొంగ ఆచూకీ తెలపండి: ఎస్ఐ


బైక్‌ను అపహరిస్తుండగా సీసీ కెమెరాలో రికార్డయిన గుర్తుతెలియని వ్యక్తి

ధరూరు, మే 12 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో రెండు రోజుల క్రితం నిలిపిన బైక్‌ను అపహరించిన గుర్తు తెలియని వ్యక్తి ఆచూకీ తెలపాలని ఎస్ఐ కొండా శ్రీహరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10వ తేదీ ధరూర్ మండల కేంద్రంలో పాల కేంద్రం ముందు నిలిపిన బైక్‌ను నలుపు రంగులో సన్నాగా ఉండి, తెలుపు రంగు హాఫ్ షర్ట్, షార్ట్ వేసుకుని ఉన్న వ్యక్తి ఎత్తుకెళ్లినట్లు ఎస్ఐ తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తి గట్టు మండలంపై వైపు వెళ్లినట్లు సమాచారం ఉందని, ఇతని ఆచూకీ తెలిపిన వారికి రూ.5వేలు బహుమతి అందజేస్తామని పేర్కొన్నారు.

చేనేత కళా నైపుణ్యానికి ప్రోత్సాహం

- డిజైనింగ్, వీవింగ్ కేటగిరిల్లో అవార్డులు
- రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహకంతో కార్మికుల్లో ఉత్సాహం

అమరచింత, మే 12 (ఆంధ్రజ్యోతి) : రెక్కాడితే గాని డొక్కాడని చేనేత కళావృత్తికి ఆదరణ తగ్గి ప్రస్తుతం వృత్తికి దూరమయ్యే పరిస్థితి నెలకొంది. దీంతో ప్రభుత్వం చేనేత కళా నైపుణ్యానికి అవార్డులు, రివార్డులు ఇస్తూ వారి నైపుణ్యాన్ని ప్రోత్సహిస్తుంది. తరతరాలుగా అందరితో ఔరా అనిపించుకునే చీరలు నేయడం వారి ప్రత్యేకత, కొత్తరకం డిజైన్లు, మారుతున్న కాలానికి అనుకూలంగా వారి వృత్తి నైపుణ్యాన్ని పెంచుకుంటూ కార్మికులు ముందుకు వెళ్తున్నారు. వీరి శ్రమకు తగ్గట్టుగా పదేళ్లుగా సంవత్సరాలుగా రాష్ట్ర ప్రభుత్వం జాతీయ చేనేత దినోత్సవం పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా చేనేత కళానైపుణ్యం డిజైనింగ్ రంగంలో అత్యంత ప్రతిభ కనబరిచిన కార్మికులను రాష్ట్ర టెక్నికల్ కమిటీ గుర్తించి వారికి అవార్డుతో పాటు నగదు ప్రోత్సాహకాన్ని అందిస్తు వస్తుంది.

కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు మీద అవార్డు

ప్రభుత్వం ప్రతీ ఏడాది ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు మీద అవార్డును అందజేస్తున్నారు. ఇందులో భాగంగా చేనేత కళాకారులు, డిజైనింగ్ వృత్తిలో నైపుణ్యం కలిగిన నేత కార్మికులను ప్రభుత్వం క్షేత్రస్థాయి నుంచి దరఖాస్తులను కలెక్టర్ల ద్వారా స్వీకరించి రాష్ట్రస్థాయిలో అత్యంత ప్రతిభ కనబరిచిన నేత కార్మికులను రెండు కేటగిరిలో ఎంపిక చేసి జాతీయ చేనేత దినోత్సవం రోజు రాష్ట్ర రాజధానిలో ఎంపికైన కార్మికులకు రూ.25వేల నగదుతో పాటు షీల్డ్ శాలువాతో సత్కరిస్తారు.

గతేడాది ఎంపిక ఇలా..

గత ఏడాది ఉమ్మడి జిల్లా నుంచి ఏడుగురు ఎంపికయ్యారు. అమరచింతకు చెందిన గాజుల వెంకటేష్ 480 పన్నుల కొంగు చీరను ప్రత్యేక డిజైన్లు వేసి అవార్డుకు ఎంపిక కాగా, ఆత్మకూరు మండలం తిప్పడంపల్లి గ్రామానికి చెందిన సత్తన్న కోట కొమ్మల పట్టుచీర యంత్ర సహాయం లేకుండా పూర్తిగా చేతితో డిజైన్ వేసి పురస్కారం అందుకున్నాడు. గద్వాలకు చెందిన వెంకటేష్ కొంగులో సాంస్కృతంతో చంద్రుడి శ్లోకాలను వచ్చే విధంగా గద్వాల చీరను మహారాష్ట్ర డిజైన్‌లో నేసి రాష్ట్రస్థాయి పురస్కారం అందుకోగా, అమిస్తాపూర్‌కు చెందిన రమేష్ దుప్పట్లు నేసే వృత్తిలో ఉంటూ ఎక్కత్ డిజైన్‌తో ఉన్ని శాలువాను నేసి అవార్డుకు ఎంపిక కాగా, అమరచింతకు చెందిన చిన్ని సీతారాములు కంచి కోటమ్మ టర్నింగ్ పట్టు చీర నేసి రాష్ట్ర అవార్డుకు ఎంపిక అయ్యాడు.


అమరచింత చేనేత హ్యాండ్లింగ్ కంపెనీలో పట్టు చీరలు నేసే మగ్గాలు


గతేడాది రాష్ట్రస్థాయి అవార్డుకు ఎంపికైన 480 పన్నుల కొంగు చీర

ప్రతిభ గల నేత కార్మికుల కోసం..



చేనేత కార్మికులకు వృత్తి పరంగా ప్రోత్సహించడానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డులను అందజేస్తుంది. అత్యంత పారదర్శకంగా క్షేత్రస్థాయిలో కలెక్టర్ ఆధ్వర్యంలో తమ చేనేత జౌళీ శాఖ వారు సేకరించిన డిజైన్లను రాష్ట్రస్థాయికి పంపి అక్కడ చేనేత టెక్నికల్ డిపార్ట్‌మెంట్ వారు ప్రతిభ కనబరిచిన నేత కార్మికులను ఎంపిక చేసి అవార్డులను అందజేస్తారు. దీంతో నేత కార్మికులలో రెట్టింపు ఉత్సాహంతో వృత్తిలో పని చేయడానికి ఎంతగానో తోడ్పాటు అవుతుంది.

- గోవిందయ్య, చేనేత జౌళి శాఖ సంచాలకుడు

గౌరవించాల్సిన అవసరం ఉంది



ప్రభుత్వం కార్మికులకు అవార్డులతో పాటు రుణమాఫీ, ఇన్సూరెన్స్ లాంటి పథకాలు తీసుకొచ్చి ప్రోత్సాహం ఇస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో ఉండే తమలాంటి కార్మికులను వారి వృత్తిని, నైపుణ్యాన్ని గౌరవించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రభుత్వం ఇచ్చే అవార్డులు, కార్మికులు మరింత కష్టపడి నైపుణ్యాన్ని పెంచుకుంటారు. అర్హులైన కార్మికులకు మాత్రమే అవార్డులను అందజేయాలి.

- రామేశ్వరమ్మ, నేత కార్మికురాలు, అమరచింత

ఏళ్లుగా పనిచేస్తున్నా..



చేనేత వృత్తిలో ఏళ్లుగా పని చేస్తున్నా తమ లాంటి కార్మికులను రెట్టింపుగా పని చేయడం కోసం ప్రభుత్వం అవార్డులు ఇవ్వడం సంతోషంగా ఉంది. అర్హులైన నైపుణ్యం కలిగిన నిజమైన కార్మికులను ఎంపిక చేయాలి. ప్రభుత్వ నిర్ణయం తమ లాంటి కార్మికుల్లో ప్రోత్సాహం కలిగిస్తుంది.

- దోమ రవి, చేనేత కార్మికుడు, అమరచింత

అట్టహాసంగా లక్ష్మీనరసింహుని రథోత్సవం


రథోత్సవంపైకి ఉత్సవ విగ్రహాలను తీసుకెళ్తున్న అర్చకులు


సిర్సవాడ బ్రహ్మోత్సవాల్లో భాగంగా రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

- సిర్సవాడలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు
- మంగళవారం చక్రస్నానంతో ముగియనున్న జాతర

తాడూరు, మే 12 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలం సిర్సవాడలోని లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు నాలుగు రోజులుగా భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. సోమవారం బ్రహ్మోత్సవాల్లో భాగంగా తెల్లవారుజామున రథోత్సవం అట్టహాసంగా జరిగింది. భారీ సంఖ్యలో పాల్గొన్న భక్తులందరు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. సాయంత్రం ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లతో ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తూ బండ్ల ఊరేగింపు చేపట్టారు. మంగళవారం ఐదవ రోజు స్వామి వారి చక్రస్నానం అసురాలమ్మ అమ్మవారికి బోనాల సమర్పణతో స్వామి వారి బ్రహ్మోత్సవాలు పూర్తవుతాయని అర్చకుడు జగదీశ్వర్ తెలిపారు.

జోగుళాంబ ఆలయంలో చండీహోమాలు

అలంపూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయాల్లో సోమవారం పౌర్ణమి సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో నిర్వమించిన సామూహిక చంహోమాల్లో 96 మంది భక్తులు పాల్గొన్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన పూజలు, మధ్యాహ్నం 12:30 గంటలకు పూర్ణాహుతితో అర్చకులు ముగించారు. అభిషేకం, స్పర్శ దర్శనం, కుంకుమార్చనలు నిర్వహించారు. అమ్మవారికి ఒడి బియ్యం, చీర, గాజులు, త్రిశతి ఖడ్గ మాలలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

న్యాయాధికారి ప్రత్యేక పూజలు

జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయంలో మహబూబ్‌నగర్ ప్రిన్సిపల్ జిల్లా న్యాయాధికారి పాపిరెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకుని పూజలు చేశారు. వీరికి ఆలయ అర్చకులు స్వాగతం పలికి గణపతి పూజ, అభిషేకం, అమ్మవారి ఆలయంలో కుంకుమార్చన నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. వీరి వెంట అలంపూరు సివిల్ కోర్టు న్యాయాధికారి మిథున్‌తేజ, కోర్టు సిబ్బంది ఉన్నారు.


న్యాయాధికారి పాపిరెడ్డికి స్వాగతం పలుకుతున్న అర్చకులు


చండీహోమంలో పాల్గొన్న భక్తులు

ఘనంగా ఆంజనేయ స్వామి రథోత్సవం

- అధిక సంఖ్యలో హాజరైన భక్తులు

ఎర్రవల్లి, మే 12 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండలంలోని బీచుపల్లి అభయాంజనేయ స్వామి రథోత్సవం సోమవారం వేలాది మంది భక్తుల మధ్య ఘనంగా నిర్వహించారు. భక్తులు ఉమ్మడి జిల్లా, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి రథోత్సవంలో పాల్గొన్నారు. భక్తులు వైశాఖ మాస పౌర్ణమిని మొదలుకుని జ్యేష్ట పౌర్ణమి(ఏరువాక పౌర్ణమి) వరకు నెల రోజుల పాటు స్వామి వారికి దాసంగాలను, తలనీలాలను సమర్పించి కృష్ణానదిలో పుణ్య స్నానాలచరించి స్వామి వారిని దర్శించుకుని మొక్కులను తీర్చుకుంటారు. గోవిందనామస్మరణలతో మార్మోగిస్తూ రథాన్ని కదిలించారు. ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు.


ఆంజనేయస్వామి మూల విగ్రహం


రథం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్, టిప్పర్ పట్టివేత

కొత్తపల్లి, మే 12 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా కొత్తపల్లి మం డలంలోని టిప్పర్‌ను మద్దూరు టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేసి ఎక్కమేడు శివారులో సోమవారం పట్టుకున్నారు. టిప్పర్‌ను మద్దూర్ పోలీ స్‌స్టేషన్‌కు తరలించి డ్రైవర్ వీరప్ప, జయరాంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. అదేవిధంగా భూనీడు శివారులో సోమవారం మధ్యాహ్నం ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను మద్దూర్ పోలీసులు పట్టుకున్నారు. యజమాని హన్మిరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గిరిజన గురుకులాల్లో ప్రవేశాలకు అవకాశం

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, మే 12 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలోని గిరిజన గురుకులాల్లో ఇంటర్ 2025-26 విద్యా సంవత్సరానికి ఈ నెల 15 బాలుర, 16 బాలికలకు స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ సమన్వయ అధికారి సుధాకర్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని అల్ మదీనా బీఎడ్ కళాశాల ఆవర ణలో గిరిజన సంక్షేమ శాఖ గురుకుల కళాశాలలో ఉంటుందని పేర్కొన్నారు. పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు హాల్ టికెట్, సర్టిఫికెట్‌తో హాజరు కావాలని సూచించారు. మెరిట్ జాబితా ఆధారంగా సీట్ కేటాయించనున్నట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాల బాలిక లు జడ్చర్ల, కల్వకుర్తి, వనపర్తి, కేటీదొడ్డి, అచ్చంపేటలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ, ఎంఎల్‌టీ కోర్సులు ఉన్నట్లు తెలిపారు. బాలురకు సంబంధించి తెలంగాణ గిరిజన గురుకుల జూనియర్ కళాశాల మన్ననూర్, పెద్దమందడి, కొండాపూర్‌లో ఎంపీసీ, బైపీసీ, హెచ్‌ఈసీ, సీఈసీ, ఒకేష నల్ కోర్సులు ఉన్నట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఒక సెట్ జిరాక్స్, ఐదు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో హాజరుకావాలని కోరారు. వివరాలకు 9490957312, 9490957314 నెంబర్‌లను సంప్రదించాలని తెలిపారు.

నేడు జిల్లా నెట్‌బాల్ జట్ల ఎంపికలు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, మే 12 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, గద్వాల, వనపర్తి జిల్లా బాల,బాలికల నెట్‌బాల్ జట్ల ఎంపికలను మంగళవారం జిల్లా కేంద్రంలోని ఇండోర్‌స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు నెట్‌బాల్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు విక్రమాదిత్యరెడ్డి, ఖాజాఖాన్ ఒక ప్రకటనలో తె లిపారు. జనగాంలో ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించనున్న 4వ ఫాస్ట్ 5 తెలంగాణ సబ్‌జూనియర్ నెట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనేందుకు ఈ ఎంపికలు చేపడుతున్నట్లు తెలిపారు. సాయంత్రం 4 గంటలకు సంబంధి త ధ్రువపత్రాలతో స్టేడియంలో ఆయా జిల్లాల కోచ్‌లకు రిపోర్టు చేయాలని కోరారు.

'మా భూమి చూపించాలి'

- 30 కి.మీ.ల పాదయాత్ర చేసుకుంటూ కలెక్టర్‌కు వినతి



లట్టుపల్లి నుంచి మండుటెండలో పాదయాత్రగా కలెక్టర్ కార్యాలయానికి వెళ్తున్న దంపతులు

బిజినేపల్లి, మే 12 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూలు జిల్లా బిజినేపల్లి మండలం బొర్సుగడ్డతండా పంచాయతీ పరిధిలోని ఇప్పలతండాకు చెందిన దంపతులు రవినాయక్, గీత తమ భూమి చూపించాలని కోరారు. ఇందుకోసం మండుటెండ లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు పాదయాత్రగా సోమవారం 30కిలో మీటర్లు పాదయాత్ర చేసుకుంటూ వెళ్లారు. లట్టుపల్లి రెవెన్యూ గ్రామ పరిధిలోని 243 సర్వే నెంబరులో మొదట వారికి 4.25 ఎకరాల భూమి ఉండేదని తెలిపారు. రోడ్డుకు ఇరువైపులా ఐదు గుంటలు పోగా, మరో ఎకరం ఆర్థిక ఇబ్బందులతో అమ్ముకున్నామని తెలిపారు. మిగతా మూడు ఎకరాల భూమికి మోకాపై కేవలం రెండు ఎకరాలు మాత్రమే ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆన్‌లైన్‌లో మూడు ఎకరాలు నమోదు ఉందని సర్వే చేసి మాకు భూమి చూపాలని తహసీల్దార్, ఆర్డీవో, ప్రజావాణిలో కలెక్టర్‌కు, పోలీసు స్టేషన్‌లో ఎన్నోమార్లు అర్జీలు పెట్టుకున్న పట్టించుకోవడం లేదని వాపోయారు. ఏమీ చేయాలో తెలియక సమస్య పరిష్కరించి న్యాయం చేయాలని పాదయాత్రగా వెళ్తతున్నట్లు బాధిత దంపతులు తెలిపారు.

ఇంటర్వ్యూ..

భూ భారతి చట్టంపై అవగాహన కల్పిస్తున్నాం

- అద్దంకి సునీత, తహసీల్దార్, చారకొండ



చారకొండ, మే 12 (ఆంధ్రజ్యోతి) భూభారతి చట్టంతో భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ అద్దంకి సునీత అన్నారు. భూభారతి చట్టంపై మండలంలోని రైతులకు, ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని సోమవారం ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో తహసీల్దార్ పలు విషయాలు వెల్లడించారు.

భూ భారతి చట్టం ద్వారా రైతులకు ఎలాంటి ప్రయోజనం ఉంటుంది ?

ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన భూ భారతి చట్టం-2025లో 23 సెక్షన్లు, 19 రూల్స్ ఉన్నాయి. భూ భారతితో భూమి తన వారసులకు మార్పు చేయాలంటే నోటీస్ పబ్లిష్ చేసిన 30 రోజుల తర్వాతనే వారసత్వం మార్పు జరుగుతుంది. రిజిస్ట్రేషన్‌లో ఏమైనా అభ్యంతరాలుంటే అప్పీల్ చేసుకోవడానికి అవకాశం ఉంది. అదే ధరణిలో రైతులకు న్యాయం జరగకపోతే కలెక్టరుకు అప్లై చేసుకోవడానికి అవకాశం ఉండేది కాదు. నేరుగా కోర్టును ఆశ్రయించాల్సిన పరిస్థితి ఉండేది.

భూ భారతిలో సాదాబైనామాలను క్రమబద్ధీకరణ చేసే అవకాశం ఉందా ?

గతంలో రిజిస్ట్రేషన్ లేకుండా జరిగిన సాదా బైనామాల లావాదేవీలకు భూ భారతి చట్టం ద్వారా పరిష్కారం లభిస్తుంది. 2014 జూన్ 2వ తేదీ కంటే ముందు గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ భూమిని సాదా బైనామా ద్వారా కొనుగోలు చేసి ఉండి గత 12 ఏళ్లుగా సాగులో ఉంటే సాదా బైనామాలో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. అధికారులు హక్కుల రికార్డులో నమోదు చేసి పట్టాపాసు పుస్తకాలు జారీ చేస్తారు. అర్హులైన వారు నిర్దేశిత ప్రక్రియ ద్వారా తమ సాదా బైనా మాలను క్రమబద్ధీకరణ చేసుకోవచ్చు.

భూ భారతి చటం ఎప్పటినుంచి అమలులోకి వస్తుంది.

జూన్ 2 తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా అమలులోకి రానుంది. గ్రామాల్లో రైతులకు, ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తు న్నాం.

రైతులకు ఏమైనా సూచనలు చేస్తారా ?

భూ సమస్యలు ఎదుర్కొంటున్న రైతులు తమ వద్దకు నేరుగా వచ్చి భూ సంబంధిత సమస్యలు తెలిపితే రికార్డులు పరిశీలించి చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను తప్పకుండా పరిష్కరిస్తాం. భూ భారతి చట్టం ద్వారా భూములకు సంబంధించిన ప్రతీ సమస్యకు పరిష్కారం లభిస్తుంది. భూ సమస్యలు తహసీల్దార్ స్థాయిలో పరిష్కారం కాకపోతే ఆర్డీవో స్థాయి, కలెక్టర్, సీసీఎల్ఏ వరకు బాధిత రైతులు వెళ్లి అప్పీల్ చేసుకోవచ్చు.

న్యూస్ బాక్స్

ఉపాధి కూలీలకు వసతులు కల్పించాలి

వంగూరు, మే 12 (ఆంధ్రజ్యోతి) : పని ప్రదేశంలో ఉపాధిహామీ కూలీలకు కనీస వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ సోమవారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో వంగూరులోని ఉపాధి హామీ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బాలస్వామి మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుకూలంగా రోజుకు రూ.6 వందలు కూలి, రెండు వందల పనిదినాలు కల్పించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వెంకటయ్య, సాయిలు, నారాయణ పాల్గొన్నారు.

నేడు ఇంటర్వ్యూలు

కోడేరు, మే 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలో రాజీవ్ యువ వికాసం లబ్ధిదారులకు నేడు తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంక్ వారు ఇంటర్వ్యూలు చేస్తారని, లబ్ధిదారులు ఎంపీడీవో కార్యాలయానికి రావాలని ఎంపీడీవో శ్రావణ్ కుమార్ అన్నారు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అప్లికేషన్‌తో పాటు ఒరిజినల్ సర్టిఫికెట్లతో రావాలని సూచించారు.

గాలివాన బీభత్సం

- రోడ్డుపై అడ్డంగా కూలిన చెట్లు



మార్చాల-కుర్మిద్ద గ్రామాల మధ్య చెట్లు విరిగినందున నిలిచిన రాకపోకలు

కల్వకుర్తి, మే 12 (ఆంధ్రజ్యోతి) : జోరుగా కురిసిన గాలివాన తీవ్ర బీభత్సం సృష్టించింది. మండలంలోని మార్చాల-కుర్మిద్ద గ్రామాల మధ్య సోమవారం ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది. ఈదురు గాలుల వల్ల చెట్లు విరిగి రోడ్డుపై అడ్డంగాపడ్డాయి. మార్చాల సబ్ స్టేషన్ పరిధిలో సుమారు 50 విద్యుత్ స్తంభాలు కూలిపోయినట్లు విద్యుత్ సిబ్బంది తెలిపారు. దీంతో మార్చాలా కుర్మిద్ద జిల్లెల గ్రామాల్లో సరఫరాకు అంతరాయం ఏర్పడింది. రోడ్డుపై భారీ చెట్లు విరిగిపడడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. మార్చాలకు చెందిన యువకులు, పోలీసులు రోడ్డుపై పడ్డ చెట్లను తొలగించే పనుల్లో నిమగ్నమయ్యారు. ఇదిలా ఉండగా కల్వకుర్తి పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి హైదరాబాద్ రూట్‌లో చుక్క వర్షం నీరు పడలేదు.

ఆదివాసి చెంచు, గిరిజనుల...

జీవన ప్రమాణాలు అంతంతే..!

అచ్చంపేట రూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి) : చెంచుల అభివృద్ధికి ప్రభుత్వం, ప్రభుత్వేతర సంస్థలు కృషి చేస్తున్నప్పటికీ వారి జీవన ప్రమాణాల్లో పెద్దగా మార్పు రాలేదు. జిల్లాలోని 20 మండలాల్లో అచ్చంపేట, అమ్రాబాద్, పదర, బల్మూరు, లింగాల, కొల్లాపూర్, పెద్దకొత్తపల్లిల్లో ఆదివాసి చెంచు గిరిజనులు నివసిస్తున్నారు. ఈ ఏడు మండలాల్లో 112 గ్రామాల్లో ఆదివాసి చెంచులు నివసిస్తున్నారు. వారి కుటుంబాలు 2556 కాగా, పురుషులు 4653, స్త్రీలు 4619 మొత్తం 9272మంది. వీరి జీవన విధానాల్లో పెద్దగా మార్పు రాలేదు. ప్రభుత్వ పథకాలలో చెంచుల అభివృద్ధికి తగిన ప్రమేయం లేకపోవడమే అందుకు కారణమని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఆదివాసి గిరిజనులైన చెంచులు వలస విధానానికి స్వస్తి పలికి ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థల పథకాలు దగ్గరైనప్పుడు మాత్రం ఎంతో కొంత ప్రయోజనం ఉంటుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి, స్వచ్ఛంద సంస్థల నుంచి పలువురు ప్రముఖులు ఆదివాసి గిరిజన చెంచు గ్రామాలను సందర్శించి వారి సమస్యలపై చర్చించి వెళ్లారు. అచ్చంపేటలోని ఒక స్వచ్ఛంద సంస్థ కొన్ని గ్రామాల్లో ఇళ్లు నిర్మించి ఇచ్చింది. ప్రభుత్వపరంగా కూడా ఇళ్లు నిర్మించి చెంచులకు ఇచ్చినా ఆ ఇళ్లలో ఉండకుండా వలస వెళ్తూ ఉంటారు. అచ్చంపేట మండలం, మిగతా ఆరు మండలాల్లో కూడా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఉపాధి హామీ కూలీలుగా చెంచులు పని చేస్తున్నారు. వాలు కట్టలు, జంగిల్ క్లియరెన్స్, ల్యాండ్ లెవలింగ్, రాళ్లు ఏరివేయడం వంటి పనుల్లో చెంచుల భాగస్వామ్యం ఉంది. వంద రోజుల పనులు పూర్తి కాగానే తాత్కాలిక వలస వెళ్లిపో తారు. ఇది ఇలా ఉంటే కోనేరు అనే స్వచ్ఛంద సంస్థ చెంచు ప్రగతి సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రం 7మండలాల్లోని 20 గ్రామా లను ఎంపిక చేసి చెంచులను అభివృద్ధి చేయా లని చెంచు ప్రగతి సేవా కేంద్రం ద్వారా ఒక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ 20 గ్రామాల్లోని ఆదివాసి చెంచు గిరిజన రైతులు ఎవరు కూడా తమ భూములను ఇతర కమ్యూనిటీ వారికి లీజుకు ఇవ్వకుండా సొంతంగా చేసుకోవడం, ఎవరైనా గిరిజనులు ఇతరులకు ఇస్తే అలాంటి వారిని గుర్తించి అవగాహన ద్వారా తిరిగి వారే సాగు చేసుకునేలా ప్రోత్సహించడం ఈ సంస్థ పని. గిరిజన రైతులకు వ్యవసాయంపై అవగాహన కల్పించి అవసరమైన వ్యవసాయ పరికాలను, విత్తనాలను అందించారు. అనేక మంది చెంచు గిరిజనులు ప్రభుత్వ పథకాల్లో భాగస్వాములు కావడం లేదు. ఇంకా మారుమూల ప్రాంతాల్లోనే జీవనం కొనసాగిస్తున్నారు.



చెంచుప్రగతి సేవా కేంద్రం ద్వారా వ్యవసాయ పరికరాలు అందుకుంటున్న ఆదివాసి చెంచులు



గ్రామాల్లో ఉపాధి హామీ పనులు చేస్తున్న ఆదివాసి చెంచులు

వైభవంగా సత్యనారాయణస్వామి వ్రతాలు

కందనూలు, మే 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని సీతారామస్వామి దేవాలయంలో వైశాఖ మాసం పౌర్ణమి సందర్భంగా సోమవారం శ్రీరమా సహిత సత్యనారాయణ స్వామి సామూహిక వ్రతాలు12మంది దంపతులతో శాస్త్రోక్తంగా నిర్వహించినట్లు రామాలయం ప్రధాన అర్చకులు కందాడై వరదరాజన్ అయ్యంగార్ తెలిపారు. ఆలయంలో ప్రతీనెల పౌర్ణమి రోజు వ్రతాలు నిర్వహిస్తున్నారని విశేష, అభిషేకం, శివాభిషేక పూజలు నిర్వహించారు. 425మంది భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అన్నప్రసాద కమిటీ సభ్యులు కందాడై శ్రీనివాసాచార్యులు, కరుణశ్రీ, అర్థం రవీందర్, టి.మ ల్లేష్, గొల్ల రాములు, రమాదేవి, రత్నమాల, శారద, నారాయణ, శివ, పుల్లయ్య, బాలస్వామి, చారి, నరసింహ గౌడ్, సాయి భక్తులు, నిత్య విష్ణుసహస్ర పారాయణం కమిటీ సభ్యులు, పాల్గొన్నారు.



సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాల్లో పాల్గొన్న భక్తులు

చౌడేశ్వరి దేవి ఆలయ పునఃనిర్మాణానికి పూజలు

బిజినేపల్లి : శిథిలా వస్థకు చేరిన యాదవుల ఆరాధ్యదైవం చౌడేశ్వరి దేవి ఆలయ పునః నిర్మాణానికి ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్ రెడ్డి సోమవారం ప్రత్యేక పూజలు చేసి మాట్లాడారు. యాదవుల ఇష్ట దైవం చౌడేశ్వరిదేవి ఆలయం పునఃనిర్మాణానికి అన్ని రకాలుగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేసి నిర్మాణ పనులను ప్రారంభించి మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు ఉంటే ఏ రంగంలో నైన విజయం సాధిస్తామని అన్నారు. ఎలాంటి సహాయ సహకారాలైనా అందించేందుకు సిద్ధంగా ఉన్నానని యాదవులకు ఆయన భరోసా కల్పించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు, యాదవ సంఘం నాయకులు ఉన్నారు.



బిజినేపల్లి : చౌడేశ్వరీ దేవి ఆలయ పునర్నిర్మాణానికి ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి

ఘనంగా మదన గోపాలస్వామి రథోత్సవం

పెంట్లవెల్లి : మండల పరిధిలోని జటప్రోలు గ్రామంలో పురాతన ఆలయంలో వెలిసిన మదన గోపాలస్వామి రథోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. కొల్లాపూర్ రాజావారు ఆదిత్య లక్ష్మణరావు ప్రత్యేక పూజలు చేసి రథాన్ని ముందుకు లాగారు. రథోత్సవం ముందు చిన్నారుల కోలాటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు భీంరెడ్డి, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు నైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలి

- డీఈవో రమేష్‌కుమార్



మాట్లాడుతున్న డీఈవో రమేష్‌కుమార్

నాగర్‌కర్నూల్ టౌన్, మే 12 (ఆంధ్రజ్యోతి): మారుతున్న కాలానికి అనుగుణంగా శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొంటూ ఉపాధ్యాయులు వారి బోధనా నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి రమేష్‌కుమార్ అన్నారు. సోమవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఉపాధ్యాయుల వృత్యాంతర శిక్షణ రిసోర్సు పర్సన్లతో డీఈవో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ఈ నెల 13నుంచి 31 వరకు జిల్లా వ్యాప్తంగా 3513 మంది ఉపాధ్యాయులకు మూడు విడతల్లో వృత్యంతర శిక్షణా తరగతులు నిర్వహించనున్నామని తెలిపారు. ఉపాధ్యాయులు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ నోడల్ అధికారి కురుమయ్య, అకాడమిక్ మానిటరింగ్ అధికారి షర్ఫుద్దీన్, జీసీడీవో శోభారాణి, వెంకటయ్య, నర్సింహులు, మురళీధర్‌రెడ్డి, ఎంఈఓలు శంకర్‌నాయక్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రతీ కుటుంబం సంపూర్ణ అక్షరాస్యతగా నిలవాలి : ఎంఈవో

తాడూరు, మే 12 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వ సూచన మేరకు ప్రతీ కుటుంబం సంపూర్ణ అక్షరాస్యతగా నిలవాలని ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం ఎంపీడీవో మీటింగ్ హాల్‌లో మండలంలోని అందరూ ప్రధానోపాధ్యాయులకు, అంగన్‌వాడీ టీచర్లకు మహిళాసంఘాల అధ్యక్షులకు సమావేశం నిర్వహించారు. ఎంఈవో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉల్లాస్ అనే పథకం ద్వారా గ్రామాల్లో 14 సంవత్సరాలు నిండిన చదువురాని వారిని గుర్తించి వారిచేత టాస్(తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ)ద్వారా పదవ తరగతి, పై చదువులు చదివేందుకు ప్రయత్నం చేయాలని తెలిపారు. త్వరలోనే ఉపాధ్యాయులకు శిక్షణా తరగతులు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లాసీఎంవో వెంకటయ్య, అంగన్‌వాడీ సూపర్ వైజర్ వనజ, ఏపీఎం బాలచంద్రయ్య, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, మహిళా సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

- సీపీఐ రాష్ట్ర నాయకుడు బాలనరసింహ



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాలనరసింహ

కల్వకుర్తి, మే 12 (ఆంధ్రజ్యోతి) : అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ప్రభుత్వం మంజూరు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాలనరసింహ డిమాండ్ చేశారు. కల్వకుర్తి పట్టణంలో సోమవారం టీఎన్‌జీవోస్ భవన్‌లో సీపీఐ జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఆయన పాల్గొని మాట్లాడారు. ఇందిరమ్మ ఇండ్లు గ్రామాల్లో ఎంత మందికి మంజూరయ్యాయో గ్రామ పంచాయతీ నోటీస్ బోర్డుపై లిస్ట్ వేయాలని కోరారు. ఆగస్టు మొదటి వారంలో సీపీఐ జిల్లా మూడవ మహాసభలు కల్వకుర్తి పట్టణంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కమిటీ సభ్యులు ఎండి.ఫయాజ్, కేశవులుగౌడ్, వార్ల వెంకటయ్య, ఈర్ల చంద్రమౌళి, ఇందిర, విజేయుడు, నరసింహ, శంకర్‌గౌడ్, శ్రీనివాస్, పరశురాం, బాలమురళి, శివుడు, శివశంకర్, గడ్డం శ్రీను, లక్ష్మీపతి, బిజ్జ శ్రీనివాస్, కిరణ్, శ్రీనివాస్, వెంకటయ్య, మధు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి : సీపీఎం

కోడేరు, మే 12 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని సీపీఎం కోడేరు కార్యదర్శి పి.రవి అధికారులను, ప్రజాప్రతినిధులను ఒక ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ గ్రామాలలో అర్హులైన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను గ్రామ సభలో ఎన్నిక చేయాలని, ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో రాజకీయాలు పక్కన పెట్టి నిజమైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని ఆయన అన్నారు. స్థలాలు లేని వారికి ఇళ్ల స్థలం ఇవ్వాలని కోరారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో ఘనంగా నర్సుల దినోత్సవం



కేక్ కట్ చేస్తున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివరాం

కల్వకుర్తి, మే 12 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం ప్రపంచ నర్సుల దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివరాం నైటింగేల్ ఫ్లోరెన్స్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్‌ను కట్ చేసి నర్సులకు పంచి పెట్టారు. అనంతరం డాక్టర్ శివరాం మాట్లాడుతూ నర్సింగ్ కేర్ వ్యవస్థను స్థాపించేందుకు మూల కారణమైన నైటింగేల్ ఫ్లోరెన్స్ జన్మదినాన్ని పురస్కరించుకుని నర్సుల దినోత్సవంగా జరుపుకుంటున్నట్లు పేర్కొన్నారు. నర్సులు 24 గంటలు రోగులకు అన్ని రకాల సేవలు అందిస్తున్నారని, వారి సేవలు అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో నర్సింగ్ ఆఫీసర్లతో పాటు ఫార్మాసిస్టు మైకేల్ మనోహర్, ల్యాబ్ సిబ్బంది భారతి, రహీం, రఘు, ఆరోగ్య మిత్రులు, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

వికాసం దరఖాస్తుల పరిశీలన



రాజీవ్ యువ వికాసం దరఖాస్తులను పరిశీలిస్తున్న ఎంపీడీవో దేవేందర్

పెంట్లవెల్లి, మే 12 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని జటప్రోలు గ్రామంలో రైతు వేదికలో సోమవారం రాజీవ్ యువ వికాసం దరఖాస్తులను ఎంపీడీవో దేవేందర్, యూనియన్ బ్యాంకు మేనేజర్ కృష్ణప్రసాద్ పరిశీలించారు. జటప్రోలులో మొత్తం 190 మంది చేసుకున్న దరఖాస్తులను పరిశీలించారు. అర్హులను గుర్తించి లబ్ధిదారుల ఎంపిక చేస్తామని వారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైసీపీ భీంరెడ్డి, గ్రామస్థులు మోత్కూరు నాగిరెడ్డి, ఏపీవో కృష్ణ పాల్గొన్నారు.

అభ్యర్థులకు ఇంటర్వ్యూలు

చారకొండ : మండల కేంద్రంలోని రైతువేదికలో ఎంపీడీవో ఇసాక్ హుసేన్ ఆధ్వర్యంలో దరఖాస్తులను పరిశీలించారు. మండలంలోని చారకొండ యూనియన్ బ్యాంకు, జూపల్లి టీజీబీ బ్యాంకు మేనేజర్లు నర్సింహ, శివప్రసాద్ పాల్గొన్నారు. 200 మంది బీసీ, 32 మంది ఈబీసీ అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరైనట్లు ఎంపీడీవో తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో వెంకటేష్, ఏపీఎం రాములు, జూనియర్ అసిస్టెంట్ ఆంజనేయులు పాల్గొన్నారు.

బ్యాంకుల వారీగా...

బల్మూరు : మండల పరిషత్ కార్యాలయంలో బ్యాంకుల వారీగా అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు సీనియర్ అసిస్టెంట్ సుదర్శన్ రెడ్డి తెలిపారు. తెలంగాణ గ్రామీణ బ్యాంక్ తుమ్మన్‌పేట శాఖ వారు ఇంటర్వ్యూలు చేశారని తెలిపారు. 13న తెలంగాణగ్రామీణ బ్యాంక్ కొండనాగుల, 14న యూనియన్ బ్యాంక్ బల్మూరు, 15న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అచ్చంపేట, 16న తెలంగాణగ్రామీణ బ్యాంక్ అచ్చంపేట అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

మాదకద్రవ్యాల నుంచి యువతను కాపాడుకోవాలి

- కరపత్రాలను విడుదల చేస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్, ఎమ్మెల్యే వంశీకృష్ణ, డీఎఫ్‌వో రోహిత్ గోపిడి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే, డీఎఫ్‌వో

మన్ననూర్, మే 12 (ఆంధ్రజ్యోతి) : మాదకద్రవ్యాల నుంచి యువతను కాపాడుకునేందుకు అందరం కటిసికట్టుగా కృషి చేద్దామని రాజ్యాంగ పరిరక్షణ వేదిక జిల్లా అధ్యక్షుడు యాదయ్య అన్నారు. అమ్రాబాద్ మండలం మాచారం గ్రామంలో 'యువతా మేలుకో.. గంజాయి మానుకో' శీర్షికతో తయారు చేసిన కరపత్రాలను అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, కలెక్టర్ బదావత్ సంతోష్ చేతుల మీదుగా సోమవారం విడుదల చేశారు. గత ప్రభుత్వం కఠినంగా వ్యవహరించకపోవడం వల్లనే మాదకద్రవ్యాలు విచ్చలవిడిగా వాడుతూ విద్యార్థులు, యువకులు మత్తుకు బానిసలై తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మాద కద్రవ్యాల వాడకం నిర్మూలించేందుకు కఠిన చర్యలు తీసుకుంటామని స్థానిక ఎమ్మెల్యే, కలెక్టర్ అధికారులు అన్నారు. కార్యక్రమంలో డీఎఫ్ఓ రోహిత్ గోపిడి, అచ్చంపేట డీఎస్పీ శ్రీనివాసులు, మాజీ జడ్పీటీసీ సభ్యురాలు డాక్టర్ అనూరాధ పాల్గొన్నారు.

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

- రెవెన్యూ అదనపు కలెక్టర్ అమరేందర్



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ అమరేందర్

నాగర్‌కర్నూల్ టౌన్, మే 12 (ఆంధ్రజ్యోతి) : ప్రజావా ణిలో వచ్చిన ఫిర్యాదుల ను నిర్లక్ష్యం చేయకుండా సత్వరమే పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ప్రజావాణికి మొత్తం 37 వినతులు వచ్చాయి. వివిధ సమస్యలపై ప్రజల నుంచి అందిన వినతులను అదనపు కలెక్టర్ స్వీకరించి పరిశీలించిన అనంతరం విచారణ కోసం సంబంధిత శాఖలకు బదిలీ చేశారు. ఆయన మాట్లాడుతూ జిల్లా స్థాయి సమస్యలను తక్షణమే పరిష్కరిం చడంతో పాటు క్షేత్రస్థాయి ఫిర్యాదులను విచారణ కోసం సంబంధిత మండలాలకు బదిలీ చేసి పరిష్కారమయ్యేదాక పర్యవేక్షించాలని ఆదేశించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలనాధికారి చంద్రశేఖర్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజావాణిలో 16 ఫిర్యాదులు

నాగర్‌కర్నూల్ క్రైం : ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 16 ఫిర్యాదులు వచ్చాయని ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ తెలిపారు. భూతగాదాల గురించి 7 ఫిర్యాదులు, భార్యాభర్తల గొడవలకు సంబంధించి 3, తగు చర్యకు న్యాయం గురించి 6 ఫిర్యాదులు వచ్చినట్లు ఆయన తెలిపారు. స్వయంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకుని సంబంధిత పోలీస్ అధికారులకు ఫిర్యాదుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించినట్లు ఎస్పీ తెలిపారు.

జిల్లా కోర్టు ప్రధాన న్యాయాధికారికి సన్మానం



జిల్లా కోర్టు ప్రధాన న్యాయాధికారిని సన్మానిస్తున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యాదిలాల్

కందనూలు, మే12 (ఆంధ్రజ్యోతి) : ఆమనగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అండేకార్ యాదిలాల్ ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ జిల్లా కోర్టు ప్రధానన్యాయాధికారి డి.రమా కాంత్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా ప్రధాన న్యాయాధికారి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట సీనియర్ న్యాయవాది మహమ్మద్ జమీల్, ఆమనగల్ బార్‌అసోసియేషన్ కోశాధికారి కొప్పు కృష్ణ, న్యాయవాదులు ఆంజనేయులు, శ్రీనివాస్, శిరీష్, శ్రీశైలం, మసూద్ ఉన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ ఎస్.కె. శంషుద్దీన్

చారకొండ, మే 12 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాల పట్ల ప్రజలకు అప్రమత్తత అవసరమని ఎస్ఐ యస్.కె. శంషుద్దీన్ అన్నారు. మండల కేంద్రంలో సైబర్ నేరాలు, కమ్యూనిటీ పోలీసింగ్‌పై సోమవారం ఎస్ఐ శంషుద్దీన్ ఆధ్వర్యంలో గ్రామస్థులకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో రోజురోజుకు సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని, వాటిపై ప్రజలు అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు పాటించాలని అన్నారు. అపరచిత వ్యక్తులతో సోషల్ మీడియాలో స్నేహం చేయరాదని, ఫోన్ చేసి వ్యక్తిగత వివరాలు అడిగితే చెప్పకూడదని అన్నారు. ఆన్‌లైన్‌లో మొబైల్ యాప్ ద్వారా ఎలాంటి లోన్స్ తీసుకోకూడదని అన్నారు. బహుమతులు గెలుచుకున్నారని వచ్చే మేసేజ్‌లకు స్పందించవద్దన్నారు. సైబర్ నేరాలపై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని అన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ అంజయ్య, కానిస్టేబుళ్లు శేఖర్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జిల్లా స్థాయి కబడ్డీ టోర్నమెంట్



సాతాపూర్‌లో జరిగిన జిల్లా స్థాయి కబడ్డీ టోర్నమెంట్‌లో విన్నర్‌గా నిలిచి మెమెంటో, నగదును అందుకుంటున్న మంతటి గ్రామ క్రీడాకారులు

- రూ.30 వేలు మంతటి జట్టు కైవసం

పెద్దకొత్తపల్లి, మే 12 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని సాతాపూర్‌లో ఫ్లడ్‌లైట్ల వెలుతురులో రెండు రోజుల పాటు కొనసాగిన జిల్లా స్థాయి కబడ్డీ టోర్నమెంట్ సోమవారం తెల్లవారు జామున విజయవంతంగా ముగిశాయి. ఈ పోటీల్లో విన్నర్‌గా నాగర్‌కర్నూల్ మండలం మంతటి జట్టు రూ.30వేలు నగదు, మెమెంటో కైవసం చేసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు శివరాజేశ్వర్‌రావు సహకారంతో జరిగిన ఈ పోటీల విజేతలకు బహుమతులను మండల సీనియర్ నాయకులు మాజీ ఎంపీటీసీ సభ్యుడు దండు నరసింహ, మైసమ్మ ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌యాదవ్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు బద్దనాయక్‌లతో కలిసి ఆయన ప్రదానం చేశారు. గెలుపొందిన జట్ల వివరాలు ఇలా ఉన్నాయి. మొదటి బహుమతి రూ.30 వేలు మంతటి గ్రామ జట్టు, రెండవ బహుమతి రూ.20వేలు సాతాపూర్ జట్టు, మూడవ బహుతి రూ.10వేలు ముద్దునూర్ గ్రామ జట్టు, నాల్గవ బహుమతి పెంట్లవెల్లి మండలం జటప్రోల్ జట్టుకు రూ.5వేలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సాతాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ కుందేళ్ల పద్మ, పరశురాముడు, కోళ్ల సత్యనారాయణ, మాజీఎంపీటీసీలు వడ్డే వెంకటయ్య, నారాయణరావు, మండల సీనియర్ నాయకులు గోపాల్‌రావు, దౌడతులసయ్య, యూత్ కాంగ్రెస్ జూపల్లి యువసేన నాయకులు అరిపల్లి అర్జున్‌యాదవ్, కే.నాగేష్, బోడ శేషయ్య, బోయ కుర్మయ్య, శవకుల రాజు, వివిధ గ్రామాల క్రీడాకారులు, ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.